విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 231 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 11 జనవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# ప్రయాణమే పెద్ద పండగ





భాగ్యనగర వాసులు సంక్రాంతి పర్వదినాన్ని సొంతూళ్లలో జరుపుకొనేందుకు పయనమవడంతో దారులన్నీ బారులు తీరాయి. పిల్లలకు పండగ సెలవులు, ఉద్యోగులకు రెండు రోజుల వారాంతపు సెలవులు కలిసి రావడంతో ఉదయం నుంచే పల్లెబాట పట్టారు. దీంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. హైదరాబాద్–విజయవాడ,

వివరాలు 2లో..

**నందిగామ వద్ద యాతన**

విజయవాడ జాతీయ రహదారిపై ఎన్టీఆర్ జిల్లా నందిగామ వద్ద భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. నందిగామ వైజంక్షన్ వద్ద ఫ్లైఓవర్‌పై నిర్మిస్తుండటంతో వాహనాలను సర్వీస్ రోడ్లపైకి మళ్లించారు. వెహికల్ అండర్ పాస్ వంతెనకు అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవటం, సర్వీస్ రోడ్డు అధ్వానంగా ఉండటంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి.

## మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూసే శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలి

### శాంతి భద్రతల పరి రక్షణలో రాజీపడొద్దు పవన్



కాకినాడ, జనవరి 10: జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సందర్శించారు. శాంతి భద్రతల పరి రక్షణ వ్యవహారంలో కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. లా అండ్ ఆర్డర్ నిర్వహణ పకడ్బందీగా ఉంటూ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని తెలిపారు. కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూసే శక్తుల పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. శనివారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని పవన్ కళ్యాణ్ సందర్శించారు. కమాండ్ కంట్రోల్ రూం, ఆఫీసర్స్ జిమ్ తదితర విభాగాలను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూంలో డయల్ 100 పని తీరు పై ఆరా తీశారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులు ఫోన్ చేసినప్పుడు సాంకేతికత సాయంతో వారి లొకేషన్ ఎలా గుర్తిస్తారో, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ సిబ్బందికి సమాచారం ఎలా చేరవేస్తారో, తదితర అంశాలను పోలీస్ అధికారులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి వివరించారు. స్నేహపూర్వక సేవలు అందిస్తూ పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు.



## అలా చేస్తే ట్రంప్‌కు కూడా మద్దతిస్తా

### ఉద్ధవ్ థాకరేతో పొత్తుపై రాజ్ థాకరే కీలక వ్యాఖ్యలు

- తనకు రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమన్న రాజ్ థాకరే
- లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎవరితోనైనా కలిసి నడుస్తానని వెల్లడి
- మరాఠీ అంశమే ఉద్ధవ్ థాకరేతో పొత్తుకు కారణమని స్పష్టీకరణ

వివరాలు 2లో..

## కొందరు అసూయతో కలలు కంటున్నారు...

# కానీ అమరావతి అన్‌స్టాపబుల్

**విజయవాడ సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు**

**అమరావతిని ఎవరూ అడ్డుకోలేరని, విమర్శలు అర్థరహితమని స్పష్టీకరణ**

**2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యమని, తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా**

**తిరుపతిలో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడి**

వరెన్ని కుట్రలు పన్నినా ప్రజా రాజధాని అమరావతి అన్‌స్టాపబుల్ అని, దానిని ఎవరూ అడ్డుకోలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కొందరు అసూయతో కలలు కంటున్నారని, అది ఎప్పటికీ జరగని పని అని ఉద్ఘాటించారు. నీరు ఉన్నచోటే నాగరికత అభివృద్ధి చెందుతుందన్న ప్రాథమిక అవగాహన లేనివారు రాజకీయాల్లో ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. శనివారం నాడు విజయవాడలోని సిద్ధార్థ అకాడమీ విద్యాసంస్థల స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలను అమరావతికి తీసుకొచ్చి, దానిని మేటి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

**విద్యారంగంలో సిద్ధార్థ అకాడమీ సేవలు అమోఘం**

విజయవాడను 'విద్యలవాడ'గా మార్చడంలో సిద్ధార్థ అకాడమీ విద్యా సంస్థలు కీలక భూమిక పోషించాయని



చంద్రబాబు ప్రశంసించారు. ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకోవడం ఒక చరిత్రాత్మక ఘట్టమని, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించి లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమని అన్నారు. తాను గతంలో సిద్ధార్థ అకాడమీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు, ఇప్పుడు గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరుకావడం సంతోషంగా ఉందని గుర్తుచేసుకున్నారు. అగ్రిటెక్ కళాశాలను ఏర్పాటు చేస్తే ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. 1975లో కొందరు ప్రముఖులు ప్రారంభించిన ఈ సంస్థ, నేడు 28 వేల మంది విద్యార్థులు, 4 వేల మంది సిబ్బందితో

వివరాలు 2లో..

## అమరావతి పై జగన్ ప్రశ్నలు అవే సజ్జల

**తాడేపల్లి, జనవరి 10:** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అమరావతిని మదర్ ఆఫ్ ఆల్ స్కామ్స్ అని పలుకుతున్నారని వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి ఆరోపించారు. ఆయన వ్యాఖ్యల ప్రకారం, పెద్ద భవనాల కోసం బడ్జెట్ పెంచడంలో అవసరం ఎంత ఉందో జగన్ మాత్రమే ప్రశ్నించారు.



కానీ ప్రభుత్వం వైపు నుంచి సరైన సమాధానం రాలేదని సజ్జల తెలిపారు. అమరావతి ప్రాజెక్ట్‌లో టెండర్లు కొందరు ప్రత్యేక కంపెనీలకే ఇచ్చడం జరుగుతోంది, దీని పై కూడా వివరణ ఇవ్వడం లేదన్నారు సజ్జల. అదే విధంగా, రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ పై కూడా ప్రభుత్వం వైపు స్పష్టత రాలేదని విమర్శించారు.

వివరాలు 2లో..



## పిల్లలతో మాతృభాషలోనే మాట్లాడండి

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

జోధ్‌పూర్: స్వదేశీని, స్వభాషను ప్రోత్సహించేందుకు ప్రజలు స్థానిక ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని, మాతృభాషలోనే సంభాషించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. సమాజాన్ని, సంస్కృతిని, మతాన్ని పరిరక్షించేందుకు భాషే కీలకమని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఎదుగుదల సాధించేందుకు ఏ భాషనైనా నేర్చుకోవచ్చని, ఇంట్లో పిల్లలతో మాట్లాడటానికి హిందీ, స్థానిక భాషలు వాడాలని చెప్పారు. తద్వారా పిల్లలను

వివరాలు 2లో..

# రాజధాని పై బురదజల్లే ప్రయత్నం సజ్జల పై మంత్రి నారాయణ ఫైర్

ఉండవల్లి, జనవరి 10: అమరావతి పై వైసీపీ నేత సజ్జల రామకృష్ణా రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మంత్రి నారాయణ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం నాడు ఉండవల్లి లోని సీఎం క్యాంప్ ఆఫీసు వద్ద మీడియాతో మంత్రి మాట్లాడుతూ వైసీపీ దృష్టిలో రాష్ట్ర రాజధాని ఎక్కడో చెప్పాలన్నారు. అమరావతి రాజధాని అని తమకు పూర్తి క్లారిటీ ఉందని, వైసీపీ కూడా రాజధాని పై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రివర్ బెడ్ కు, రివర్ బేసిన్ కు తేడా తెలియకుండా మాట్లాడారని వ్యాఖ్యలు చేశారు. చాలా నగరాలు రివర్ బేసిన్ లోనే మహా నగరాలుగా అభివృద్ధి చెందాయని మంత్రి తెలిపారు. రైతులతో మాట్లాడటానికి ఇష్టపడని నాయకులు, ఇప్పుడు లేనిపోని ప్రేమ చూపిస్తారని మంత్రి నారాయణ మండి పడ్డారు.

వివరాలు 2లో..




## ఇడి దాడుల పై మమతా బెనర్జీ ప్రభుత్వం కేవియట్ పిటిషన్



కోల్‌కతా : ఐప్యాక్ పై ఇడి దాడుల పై పశ్చిమబెంగాల్ ప్రభుత్వం శనివారం సుప్రీం కోర్టు లో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. తమ వాదనలు వినకుండా ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయకూడదని పిటిషన్‌లో కోరింది. కోట్లాది రూపాయిల బొగ్గు స్కామ్ కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఇడి గురువారం కోల్‌కతా లోని ఐప్యాక్, దాని డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంలో సోదాలు జరిపిన సంగతి తెలిసిందే. ఇడి దాడుల పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండి పడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థ నిబంధనలు అతిక్రమించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సోదాలు చేపడుతుండగా ఐప్యాక్ కార్యాలయం లోకి ప్రవేశించిన మమతా బెనర్జీ డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు సహా కీలక ఆధారాలను తీసుకువెళ్లినట్లు ఇడి ఆరోపించింది. మమతా బెనర్జీ పై సిబిఐ దర్యాప్తు కోరుతూ శుక్రవారం కోల్‌కతా హైకోర్టునను ఆశ్రయించింది. ప్రతీక్ జైన్ నివాసం పై జరిగిన దాడిలో పోలీసుల సాయంతో ఆమె ఇడి కస్టడీ నుండి నేరారోపణ పత్రాలను తీసుకువెళ్లారని పిటిషన్‌లో పేర్కొంది. ఈ పిటిషన్ పై మమతా బెనర్జీ ప్రభుత్వం శనివారం సుప్రీం కోర్టులో కేవియట్ దాఖలు చేసింది.





# అయోధ్యలో భద్రతా వైఫల్యం కశ్మీర్ ముస్లిం నిర్బంధం..

అయోధ్య, జనవరి 10: అయోధ్య రామాలయం క్లాంప్లెక్స్‌లో భద్రతా వైఫల్యం చోటు చేసుకుంది. కాంప్లెక్స్ ఆవరణలో నమాజ్ చేసేందుకు ప్రయత్నించిన కశ్మీర్ వ్యక్తిని భద్రతా సిబ్బంది శనివారంనాడు అదుపు లోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. కాంప్లెక్స్ లోని దక్షిణ గోడల ప్రాంతం వద్ద ఉన్న సీతాదేవి వంటగది సమీపంలో ఆ వ్యక్తి నమాజ్ కు ప్రయత్నించినట్టు సమాచారం. కశ్మీరీ సంప్రదాయ దుస్తులు ధరించిన వ్యక్తి గేట్ డీ1 ద్వారా రామాలయం లోకి ప్రవేశించాడు. అతనిని కశ్మీర్ లోని షోపియాన్ నివాసి అహ్మద్ షేక్ గా గుర్తించారు. అతన్ని ఆపేందుకు ప్రయత్నించగా ఒక మతానికి చెందిన వ్యక్తుల సపోర్ట్ కోరుతూ నినాదాలు చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం అతన్ని భద్రతా సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. కాగా,

వివరాలు 2లో..

# ప్రయాణమే పెద్ద పండగ

హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారుల్లో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. శుక్ర, శనివారాల్లో సుమారు 3 లక్షల మంది సొంతూళ్లకు వెళ్లినట్లు పోలీసుల అంచనా. పలు సిటీ సర్వీసులను విజయవాడ, వరంగల్, వికారాబాద్ తదితర జిల్లాలకు కేటాయించారు. దీంతో నగరవాసులు సరిపడా బస్సులు లేక ఇబ్బందులుపడ్డారు. బస్సుల సమాచారం తెలుసుకునేందుకు ఆర్టీసీ 'గమ్యం' యాప్‌ను లక్షల మంది వినియోగిస్తున్నారు. అయితే సంక్రాంతి వంటి కీలక సమయంలో ఈ యాప్ మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంత ప్రయత్నించినా 'నో సిటీ సర్వీస్' అనే ఎర్రర్ రావడంతో అసహనం వ్యక్తం చేశారు.

**'క్యూ'.. చుక్.. చుక్.. రైలు**

శనివారం ఫలక్‌నుమా, విశాఖ, గోదావరి, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లతోపాటు అన్ని ప్రధాన రైళ్లలో ఇసుకేస్తే రాలనంతగా ప్రయాణికుల రద్దీ నెలకొంది. దీంతో రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నారు.

**హైదరాబాద్-విజయవాడ హైవేపై కిటకిట**

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రద్దీని చూస్తే భాగ్యనగరం ఖాళీ అవుతోందా అన్నట్టుంది. నాలుగైదు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా నుంచి శుక్రవారం రాత్రి 12 నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు దాదాపు 21 వేలు, శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 22 వేల వరకు వాహనాలు విజయవాడ వైపు ప్రయాణించినట్లు సిబ్బంది చెప్పారు. ఈ లెక్కన గంటకు సుమారు 2,700 వాహనాలు వెళ్తున్నాయి. సాధారణ రోజుల్లో రెండు వైపులా కలిపి దాదాపు 40 వేల వాహనాలు వెళ్తాయి. గతేడాది ఎదురైన రద్దీ అనుభవాల దృష్ట్యా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. చిట్యాలలో పనులు చేస్తున్న దారిపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి దానిపై నుంచి వాహనాలను పంపిస్తున్నారు. విశాఖపట్నం, రాజమహేంద్రవరం వైపు వెళ్లాల్సిన వాహనాలను సూర్యాపేట మండలం టేకుమట్లలోని సూర్యాపేట-ఖమ్మం 365బీబీ హైవే వైపు మళ్లించారు. సూర్యాపేట ఎస్పీ నరసింహ, డీఎస్పీ ప్రసన్నకుమార్ డ్రోన్ కెమెరాతో రహదారిపై వాహనాల వేగాన్ని, రద్దీని పర్యవేక్షిస్తున్నారు. సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని ఎస్పీ నరసింహ.. గులాబీ పువ్వులు ఇచ్చి వాహనదారులకు శుభాకాంక్షలు చెప్పారు.

**1033కి ఫోన్ చేస్తే తక్షణ పరిష్కారం**

సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి రద్దీగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో వాహనం అకస్మాత్తుగా ఆగిపోయినా, రోడ్డు ప్రమాదం జరిగినా, ఇంధనం అయిపోయినా, టైరు పంక్చరైనా వెంటనే 1033 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే పరిష్కారం లభిస్తుంది. రోడ్డు ప్రమాదం జరిగితే వెంటనే ఘటనాస్థలికి అంబులెన్సును పంపించి క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలిస్తారు. రోడ్డుపై అడ్డంగా వాహనం నిలిచిపోతే క్రేన్ సాయంతో పక్కకు తరలిస్తారు. మార్గం మధ్యలో వాహనంలో ఇంధనం అయిపోతే పెట్రోలింగ్ వాహన సిబ్బంది 5 లీటర్ల పెట్రోల్ లేదా డీజిల్ తెచ్చి ఇస్తారు. ఇంధనం ధరను వాహనదారుడు చెల్లించాల్సి ఉంటుంది. వాహనం టైరు పంక్చరైనా సిబ్బంది సహాయసహకారాలు అందిస్తారు. ఈ సేవలన్నీ ఉచితంగానే లభిస్తాయి. వాహనదారుడు 1033కు ఫోన్ చేసిన 20-25 నిమిషాల్లోపే ఘటనా స్థలికి పెట్రోలింగ్, రెస్క్యూ సిబ్బంది చేరుకుని సమస్యను పరిష్కరిస్తారు. ఈ టోల్ ఫ్రీ నంబరు 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

**విమాన టికెట్లకూ రెక్కలు**

ప్రయాణికుల రద్దీని చూసి విమానయాన సంస్థలూ ఈ నెల 11 నుంచి 14 వరకు టికెట్ ధరలను ఒక్కసారిగా మూడింతలు పెంచేశాయి. ముఖ్యంగా శంషాబాద్ విమానాశ్రయం నుంచి విజయవాడ, విశాఖ, తిరుపతికి వెళ్లే విమానాల టికెట్ల ధరలు భారీగా పెరిగాయి. సాధారణ రోజుల్లో విజయవాడ, వైజాగ్‌లకు రూ.2,500 నుంచి రూ.3,500 మధ్య ఉంటుండగా.. ఆదివారం ధర రూ.9 వేలు ఉంది. తిరుగు ప్రయాణంలోనూ ఇదే తరహాలో రేట్లు కనిపిస్తున్నాయి.

## వైద్యులు నిస్వార్థంతో సమాజానికి అండగా నిలబడాలి డిప్యూటీ సీఎం పవన్







కాకినాడ, జనవరి 10: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం కాకినాడలో రంగరాయ మెడికల్ కాలేజ్ లో (ఆర్ఎంసి) పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వైద్యులు ఎంత బిజీగా ఉన్నప్పటికీ, కనీసం నెలలో ఒక్క రోజైనా గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వెళ్లి నిరుపేదలకు సేవ అందించాలని విద్యార్థులను ద్దేశించి కోరారు. వైద్య వృత్తి కేవలం ఒక ఉద్యోగం కాదని, అది మానవత్వంతో కూడిన దైవ కార్యమని పవన్ అన్నారు. పూర్వ విద్యార్థులు రూ.10.11 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించడానికి ముందుకు రావడం ఎంతో అభినందించాల్సిన విషయం అన్నారు. ప్రతి కళాశాల పూర్వ విద్యార్థులు ఇలా ఆలోచిస్తే ఏ కళాశాలా ప్రైవేటు పరం కాదని, యువతలో విశాల దృక్పథం రావాలని ఆకాంక్షించారు పవన్. విద్యావంతులు కుల మతాలకు అతీతంగా సమాజం గురించి ఆలోచించాలని, ఇరుకు మనస్తత్వాలు అభివృద్ధికి ఆకంటంగా మారుతాయని పవన్ కల్యాణ్ అన్నారు. అరకు ప్రాంతంలో సికిల్ సెల్ అనీమియా బాధితుల కోసం దాతల సహకారంతో బ్లడ్ బ్యాంక్ నిర్మిస్తున్నామని వెల్లడించారు.

# అలా చేస్తే ట్రంప్‌కు కూడా మద్దతిస్తా

మహారాష్ట్ర, మరాఠీ భాషాభివృద్ధికి సహకరిస్తే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సైతం మద్దతు ఇవ్వడానికి వెనుకాడబోనని మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ థాకరే స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు తనకు ముఖ్యమని ఆయన ఉద్ఘాటించారు. దాదాపు ఇరవై సంవత్సరాల తర్వాత బీఎంసీ ఎన్నికల కోసం ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ కలిసి పనిచేయనున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్ థాకరే ఆంగ్ల మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, మరాఠీ ప్రజల సంక్షేమం, మరాఠీ భాష పరిరక్షణ, బలమైన మహారాష్ట్ర అనే అంశాలు తనకు అత్యంత ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఈ లక్ష్యాలను సాధించడానికి ఎవరితోనైనా కలిసి పనిచేస్తామని ఆయన అన్నారు. మరాఠీని శాస్త్రీయ భాషగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, భాష పరిరక్షణ, అభివృద్ధి కోసం ఎలాంటి ఆర్థిక సహాయం అందించడం లేదని ఆయన విమర్శించారు. ఉద్ధవ్ థాకరే పార్టీతో పొత్తు గురించి స్పందిస్తూ, మరాఠీ అంశమే తమ మధ్య పొత్తుకు ప్రధాన కారణమని రాజ్ థాకరే వెల్లడించారు. మహారాష్ట్రను బలోపేతం చేయడానికి ట్రంప్ వంటి వ్యక్తికి కూడా మద్దతు ఇవ్వడానికి తాను సంకోచించనని ఆయన నొక్కి చెప్పారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ, మరాఠీ గుర్తింపు కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉన్నానని ఆయన తెలిపారు. బాల్ ఠాక్రే అందించిన విలువలకు కట్టుబడి ఉన్నానని, తనను 'కట్టర్ మరాఠీ' అని పిలుస్తారని, ఆ విషయంలో తాను ఎప్పటికీ వెనక్కి తగ్గబోనని రాజ్ థాకరే తేల్చి చెప్పారు.

# కొందరు అసూయతో కలలు కంటున్నారు...

# కానీ అమరావతి అన్‌స్టాపబుల్

-**మొదటిపేజీ తరువాయి**

మహావృక్షంగా ఎదిగిందని కొనియాడారు.

**అమరావతిపై కుట్రలను తిప్పికొడతాం**

కొందరి అసూయకు హద్దు లేకుండా పోతోందని, గత ప్రభుత్వ హయాంలో అమరావతిని ఆపేందుకు చేసిన కుట్రలను ప్రజలు చూశారని చంద్రబాబు అన్నారు. అయినా వారికి బుద్ధి రాలేదని విమర్శించారు. నదీ పరివాహక ప్రాంతంలో రాజధాని కడుతున్నారని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ఢిల్లీ, చెన్నై, రాజమండ్రి వంటి నగరాలన్నీ నదీ తీరాల్లోనే ఉన్నాయన్న విషయం వారికి తెలియదా అని ప్రశ్నించారు. అమరావతిని పవిత్ర జలాలు, మట్టితో పునీతం చేశామని, భవిష్యత్తులో విజయవాడ, గుంటూరు, మంగళగిరి కలిసి అద్భుత నివాస ప్రాంతంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఆరు నెలల్లో అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్ వస్తుందని, రెండేళ్లలో ఇక్కడి నుంచే ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్లను సరఫరా చేస్తామని వెల్లడించారు.

**విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు**

కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి కిలోమీటర్‌కు ఒక ప్రాథమిక పాఠశాల, ఐదు కిలోమీటర్లకు ఉన్నత పాఠశాల, ప్రతి మండలంలో జూనియర్ కళాశాల, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఇంజినీరింగ్ కళాశాల, ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. విభజన చట్టం ద్వారా రాష్ట్రానికి వచ్చిన ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ విద్యా సంస్థలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని వివరించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు, తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు ఏడాదికి రెండుసార్లు మెగా పేరెంట్-టీచర్ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు.

**అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. విశాఖకు గూగుల్ వస్తోందని, ఇప్పటికే కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి సంస్థలు కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని తెలిపారు. రాయలసీమలో స్పేస్ సిటీ, డిఫెన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని, కర్నూలు జిల్లా ఓర్వకల్లు డ్రోన్ హబ్‌గా మారబోతోందని చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకెళుతున్నామని, ఆరోగ్య రంగాన్ని కృత్రిమ మేధ (ఏఐ)తో అనుసంధానించి మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 2047 నాటికి భారత్ ప్రపంచంలో నంబర్ 1 స్థానానికి చేరుకుంటుందని, అదే సమయానికి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా నిలుస్తుందని చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

### అయోధ్యలో భద్రతా వైఫల్యం

## కశ్మీర్ ముస్లిం నిర్బంధం..

-**మొదటిపేజీ తరువాయి**

ఈ ఘటన పై జిల్లా యంత్రాంగం ఇంతవరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. రామాలయం ట్రస్టు సైతం వెంటనే స్పందించలేదు. మరో వైపు రామాలయానికి 15 కిలో మీటర్ల లోపు నాన్-వెజిటేరియన్ ఆహారాన్ని సరఫరా చేయరాదంటూ జిల్లా యంత్రాంగం శుక్రవారం నాడు ఒక అధికారిక ప్రకటన జారీచేసింది. అతిథులకు నాన్-వెజిటేరియన్ ఆహారం, ఆల్కహాలిక్ డ్రింకులు సరఫరా చేయరాదని హోటళ్లు, వసతి గృహాలకు హెచ్చరికలు జారీచేసింది. ఆన్‌లైన్ ఆర్డర్ ఇచ్చిన టూరిస్టులకు నాన్‌వెజ్ సరఫరా చేస్తున్నట్టు తమకు సమాచారం అందడంతో రామాలయం, సమీప ప్రాంతాల్లో ఆన్‌లైన్ డెలివరీ పై నిషేధం విధించామని అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్ మాణిక్ చంద్ర సింగ్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అమరావతి పై జగన్ ప్రశ్నలు అవే సజ్జల

-**మొదటిపేజీ తరువాయి**

ఈ నేపథ్యంలో జగన్ ప్రశ్నించిన అంశాలను ప్రభుత్వమే పరిగణించకపోవడం పై సజ్జల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సజ్జల అభిప్రాయం ప్రకారం, అమరావతి ప్రాజెక్ట్ విషయంలో నిర్దిష్ట సమాధానాలు రాలేకపోవడం ప్రజల్లో అవిశ్వాసాన్ని పెంచుతుంది. ఆయన జగన్ ను తప్పుగా వివరిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం అమరావతిని రాజధాని పేరుతో మించిన విమర్శలు చేస్తున్నారు అని సజ్జల రామకృష్ణా రెడ్డి ర్కొన్నారు.

## రాజధాని పై బురదజల్లే ప్రయత్నం సజ్జల పై మంత్రి నారాయణ ఫైర్

-**మొదటిపేజీ తరువాయి**

గత ప్రభుత్వ నిర్వాకం తోనే అమరావతి పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని విమర్శలు గుప్పించారు. అమరావతి నిర్మాణ పనులకు పారదర్శకంగా టెండర్లు పిలిచామని స్పష్టం చేశారు. రాజధాని పై బురద జల్లే ఉద్దేశంతో అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సెక్రటేరియట్‌లో కేవలం మంత్రులు, వారి శాఖలు, అధికారులు మాత్రమే ఉండేలా నిర్మించారన్నారు. కానీ అమరావతిలో నిర్మించే సెక్రటేరియట్‌లో మంత్రులు, సిబ్బంది, హెచ్‌వోడీలు, ఇతర కార్పొరేషన్లు అన్నీ ఒకేచోట ఉండేలా నిర్మిస్తున్నామని వివరించారు. ప్రజలకు పాలన దగ్గరగా ఉండే విధంగా అన్ని నిర్మాణాలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాజధాని పై మాట్లాడే ముందు జగన్ స్టడీ చేసి మాట్లాడాలని మంత్రి నారాయణ హితవు పలికారు.

## పిల్లలతో మాతృభాషలోనే మాట్లాడండి

-**మొదటిపేజీ తరువాయి**

వారి మూలాలతో జతచేసినట్లవుతుందన్నారు. స్వదేశీ, స్వభాషల ద్వారానే భారత్ ఆత్మనిర్భరత సాధించగలదన్నారు. శనివారం జోధ్‌పూర్‌లో మహేశ్వరీ సామాజిక వర్గ ప్రపంచ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'మీరు మీ పిల్లలతో మీ భాషలో మాట్లాడితే వారికి తమ చరిత్రతో తమ రాష్ట్రంతో అనుబంధం ఏర్పడుతుంది. ప్రతి సామాజిక వర్గం తమలోని పేదల అభివృద్ధికి పాటుపడితే దేశంలోని పేదలందరికీ రక్షణ లభిస్తుంది' అని చెప్పారు. మన సామాజిక వర్గాలు సంకుచితత్వానికి కాకుండా ఐక్యతకు ప్రతీకలని చెప్పారు.

## సీఎం చంద్రబాబును కలిసిన ప్రకృతి వైద్య నిపుణుడు మంతెన

**ఏపీ ప్రభుత్వ ప్రకృతి వైద్య సలహాదారుగా మంతెన సత్యనారాయణ రాజు**

**సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు**

**రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్న మంతెన**

**యోగా, ప్రకృతి వైద్యంపై ప్రభుత్వానికి సలహాలు అందించనున్న వైనం**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రకృతి వైద్య సలహాదారుగా ఇటీవల నియమితులైన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు శనివారం నాడు సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసిన ఆయన, తనకు సలహాదారుగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంతెన సత్యనారాయణ రాజుకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి వైద్య రంగంలో డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజుకున్న అనుభవాన్ని వినియోగించుకోవాలని భావించిన ప్రభుత్వం, ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రకృతి వైద్య సలహాదారుగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ డిసెంబర్ 29న అధికారికంగా ఉత్తర్వులు (జీవో) జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, డాక్టర్ రాజు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. రాష్ట్రంలో యోగా, ప్రకృతి వైద్యానికి సంబంధించిన విధానాలపై ప్రభుత్వానికి డాక్టర్ రాజు సలహాలు, సూచనలు అందించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి సిద్ధమైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై విస్తృతంగా ప్రచారం చేస్తూ మంతెన సత్యనారాయణ రాజు విశేష ప్రజాదరణ పొందారు. ఆయన అమరావతి సమీపంలో 'మంతెన ఆరోగ్యాలయం' పేరుతో ప్రకృతి చికిత్సాలయం, పరిశోధన కేంద్రాన్ని కూడా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలి అనిత



**గుంటూరు, పెన్ సత్తా, జనవరి 10**: ఎర్ర బస్సులు కూడా అందని ప్రాంతాలకు ఎయిర్ బస్ ను తీసుకొచ్చిన నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడేనని రాష్ట్ర హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. శనివారం గుంటూరు లోని కేఎల్ యూనివర్సిటీ లో నిర్వహించిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ మొదటి విడత ఫలితాలను ఆమె అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, చదువు పై పూర్తి దృష్టి పెట్టాలని సూచించారు. ఉన్నత విద్య ద్వారా మంచి భవిష్యత్తును నిర్మించు కోవాలని, శ్రమతో కూడిన కృషి చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. యువత పై ప్రత్యేక దృష్టి: రాష్ట్ర ప్రభుత్వం యువత సంక్షేమానికి ప్రత్యేక పథకాలు తీసుకొస్తోందని, చదువుతో పాటు ఆలోచనా సామర్థ్యం పెంపొందించు కోవాలని విద్యార్థులకు సూచనలు చేశారు. డ్రగ్స్ పై కూటమి ప్రభుత్వ కఠిన వైఖరి: డ్రగ్స్ వినియోగం పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని, యువత తమ లక్ష్యాల సాధనకు ఈ వ్యసనాల నుంచి పూర్తిగా దూరంగా ఉండాలని హోంమంత్రి హెచ్చరించారు. విద్యా సంస్థల పాత్ర:

విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత పెంచడంలో విద్యా సంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో మౌలిక వసతులు, రవాణా రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని ఆమె అన్నారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటే యువతకు ప్రపంచ స్థాయిలో అవకాశాలు లభిస్తాయని హోంమంత్రి అభిప్రాయపడ్డారు.

# మాజీ ఐపీఎస్ భార్యను మోసగించిన సైబర్ కేటుగాళ్లు..

**హైదరాబాద్: పెన్ సత్తా, జనవరి 10:** సైబర్ మోసగాళ్ల బారిన పడ్డ ఓ మాజీ ఐపీఎస్ అధికారి భార్య ఏకంగా రూ. 2.58 కోట్ల మేర నష్టపోయారు. తాజాగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట సైబర్ నేరగాళ్లు మోసానికి తెరలేపారు. ట్రేడింగ్‌లో చిట్కాల చెబుతామని మొదట వాట్సాప్ మెసేజ్ పంపించారు. తమ చిట్కాలు పాటిస్తే ట్రేడింగ్‌లో 500 శాతం లాభాలు వస్తాయని అన్నారు. సెబీ సర్టిఫైడ్ డాక్యుమెంట్స్ అంటూ కొన్ని నకిలీ కాపీలను కూడా చూపించారు. ఈ విషయాల పై అవగాహన లేకపోవడంతో ఆమె తన భర్త మొబైల్ నెంబర్ ను వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేయించారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన బాధితురాలు భారీగా పెట్టుబడులు పెట్టారు. 19 లావాదేవీల్లో రూ. 2.58 కోట్ల మేర బదిలీ చేశారు. ఆ తరువాత పెట్టుబడులను నిలిపివేయడంతో నిందితులు బెదిరింపులకు దిగారు. ఇన్వెస్ట్‌మెంట్స్‌ను నిలిపివేస్తే అప్పటివరకూ పెట్టిన పెట్టుబడి పోతుందని బెదిరించారు. ఈ క్రమంలో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు చివరకు పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు




నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఘటన పై దర్యాప్తు ప్రారంభించారు.

# పాకిస్థాన్ కు చెందిన ఏషియా వన్ మీడియా ఛానల్ ని బ్లాక్ చేసిన భారత్




**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, జనవరి 10:** పాకిస్థాన్ కు చెందిన ఏషియా వన్ అనే మీడియా ఛానల్ కు సంబంధించిన సామాజిక మాధ్యమాల్ని భారత్ బ్లాక్ చేసింది. ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించడంతో పాటు భారత్ లోని సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్న అనుమానంతో ఈ ఛానెల్ పై భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఛానెల్ పాకిస్థాన్ మిలిటరీ భాగస్వామ్యంతో పనిచేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. అలాగే ఇంటర్- సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ), దాని మీడియా వింగ్ ఐఎస్పీఆర్ తో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లు తేలిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ మద్దతుతో కొనసాగుతున్న "ఏషియా వన్" అనే న్యూస్ ఛానెల్ ను వివిధ సామాజిక మాధ్యమాల్లో బ్లాక్ చేసింది భారత్. భారత్ కు వ్యతిరేకంగా రెచ్చగొట్టే పోస్టులు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు తేల్చిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఏషియా వన్ ఛానెల్ గతేడాది మే లో పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన తర్వాత ప్రారంభం కావడంతో ఈ ఛానెల్ పై నిఘా పెట్టాయి భారత్ లోని నిఘా వర్గాలు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ కు సంబంధించి ఫేక్ వార్తలను ప్రచారం చేయడానికి ఈ ఛానెల్ ను ఏర్పాటు చేసింది పాకిస్థాన్. ఇటీవల ఈ ఛానెల్ ఎక్స్ వేదికగా పెట్టిన ఓ పోస్టును భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఫ్యాక్ట్ చెక్ చేసి నిజనిజాలను వెల్లడించింది. దీంతో ఈ ఛానెల్ తో భవిష్యత్తులో మరింత ప్రమాదం పొంచి ఉందని భావించిన నిఘా అధికారులు ఈ ఛానెల్ ను భారత్ లో బ్లాక్ చేశాయి. పాకిస్థాన్ కు చెందిన మొదటి గ్లోబల్ శాటిలైట్ ఇంగ్లీష్ న్యూస్ నెట్ వర్క్ అంటూ ఈ ఛానెల్ ను సామాజిక మాధ్యల్లో ఊదరగొట్టారు. యాంకర్లు, న్యూస్ రీడర్ల కోసం విదేశీయులను నియమించుకున్నారు. అంతర్జాతీయ న్యూస్ ఛానెల్స్ అయిన అల్ జజీరా, టీఆర్ టీ మాదిరి హైలెట్ చేసేందుకు పాకిస్థాన్ యత్నించింది. ఈ ఛానెల్ కు పాకిస్థాన్ మిలిటరీ, ఐఎస్ఐ వర్గాలతో సత్సంబంధాలు ఉన్నాయి. ఈ ఛానెల్ ప్రారంభం నుంచీ భారత్ పై విషం చిమ్ముతూ వస్తోంది. ఈ ఛానెల్ పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ కు సంబంధించి నకిలీ వార్తలను నెట్టింట ప్రచారం చేస్తోంది. అలాగే జమ్మూ కాశ్మీర్, సరిహద్దు టెర్రరిజం, దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పై తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. అయితే పహల్గామ్ దాడి, ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్ కు చెందిన డజన్లకొద్దీ న్యూస్ ఛానెల్స్, యూట్యూబ్ ఛానెల్స్ ను భారత్ నిషేధించిన విషయం తెలిసిందే. ఇప్పటికీ వాటి పై నిషేధం కొనసాగుతూనే ఉంది. మరో వైపు పాకిస్థాన్ లో మీడియారంగం క్షీణిస్తోంది. ఇటీవల పాకిస్థాన్ లోని యాంటీ- టెర్రరిజం కోర్టు డిజిటల్ టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తున్న కారణంగా అనేక మంది జర్నలిస్టులకు డబుల్ యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. 2023 లో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్ కావడంతో ఆ సమయంలో ఆన్ లైన్ వేదికగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ప్రకటనలు చేసినట్లు తేలడంతో కోర్టు తీర్పు వెల్లడించింది.

## వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంచిన ఆమెరికా

- మరో షాకిచ్చిన అమెరికా! మార్చ్ 1 నుంచీ..




**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, జనవరి 10:** అమెరికా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ (యుఎస్ సిఐఎస్) తాజాగా వెల్లడించింది. కొత్త రేట్స్ మార్చ్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. హెచ్-1బీ, ఎల్-1 సహా పలు రకాల వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను వేగవంతం చేసేందుకు అమెరికా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును చార్జ్ చేస్తుంటుంది. హెచ్-1బీ లాంటి వీసాల విషయంలో గతంలో 2,805 డాలర్లుగా ఉన్న ప్రీమియం ఫీజు ప్రస్తుతం 2,965 కి పెరిగింది. విదేశీ ఉద్యోగుల వీసా దరఖాస్తు పరిశీలనను వేగవంతం చేసేందుకు అమెరికా సంస్థలు ఈ ఫీజును చెల్లిస్తుంటాయి. ఇక ఎఫ్-1, జే-1 వంటి వీసాల ప్రీమియం ఫీజు కూడా 1,965 డాలర్ల నుంచి 2,075 డాలర్లకు పెరిగింది. 2023 జూన్ నుంచి, 2025 జూన్ మధ్య కాలంలో పెరిగిన ద్రవ్యోల్బణాన్ని పరిగణన లోకి తీసుకుని ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ పేర్కొంది. జాబ్స్ మారే వారు, వీసాలను రెన్యూవల్ చేసుకునే విదేశస్తుల పై ఈ పెంపు భారం పడనుంది. ఫీజు పెంపుతో వచ్చే అదనపు నిధులతో తమ కార్యకలాపాలను మరింత సరళతరం చేసేందుకు వినియోగిస్తామని ప్రభుత్వం తెలిపింది. వీసా దరఖాస్తుల బ్యాక్‌లాగ్స్ తగ్గడంతో పాటు వీసా దరఖాస్తుల పరిశీలన ఇతర సేవలు మరింత వేగవంతం అవుతాయని చెప్పింది. వీసా సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ధరలు సరిదిద్దడమే తమ లక్ష్యమని కూడా వెల్లడించింది. వలసల కట్టడికి ఇప్పటికే అమెరికా ప్రభుత్వం వివిధ మార్గాలను అనుసరిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వీసా నిబంధనలు ఉల్లంఘిస్తే చిక్కులు తప్పవని ఇటీవల భారతీయ ఎంబసీ ఎక్స్ వేదికగా హెచ్చరించిన విషయం తెలిసిందే.

## నారా భువనేశ్వరికి అవుట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డ్



**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, జనవరి 10:**భారత డెయిరీ రంగ అభివృద్ధిలో విశిష్ట సేవలకు హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ వైస్ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరికి ప్రతిష్ఠాత్మక అవుట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు-2025'ను సౌత్‌జోన్ ప్రదానం చేసింది. డెయిరీ పరిశ్రమ అభివృద్ధిలో ఆమె చూపిన దూరదృష్టి నాయకత్వం, రైతుల సాధికారతకు చేసిన విశేష కృషి, డెయిరీ ఎకోసిస్టం పై ఆమె కల్పించిన సానుకూల ప్రభావాన్ని గుర్తిస్తూ ఈ అవార్డు వరించింది. ఈ నెల 9 న కేరళ లోని కోజికోడ్‌లో కాలికట్ ట్రేడ్ సెంటర్, డాక్టర్ వర్గీస్ కురియన్ నగర్‌లో నిర్వహించిన సదరన్ డెయిరీ అండ్ ఫుడ్ కాన్‌క్లేవ్-2026 ప్రారంభ సమావేశంలో కేరళ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి జె. చించు రాణి చేతుల మీదుగా భువనేశ్వరి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడం పై భువనేశ్వరి స్పందించారు. తనకు ఈ గౌరవాన్ని అందించిన ఇండియన్ డెయిరీ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ లోని వేలాది మంది పాడి రైతులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. భారత డెయిరీ రంగం అభివృద్ధి, శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని మరోసారి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సతీమణి నారా భువనేశ్వరి పై ప్రశంసలు కురిపించారు. ఆమెకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారాయన. పాడి రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత కోసం ఆమె చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ పురస్కారం భువనేశ్వరి సహా ఆమె బృందానికి దక్కాల్సిన సరైన గుర్తింపని సీఎం పేర్కొన్నారు. ఈ గౌరవం వెనుక ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతుల కృషి ఉందన్నారు.

# ముగ్గుల పోటీలను సద్వినియోగం చేసుకోండి మంత్రి సవిత

**ముత్యాల ముగ్గుల పోటీ కరపత్రాలను విడుదల చేసిన రాష్ట్ర మంత్రి సవితమ్మ.**

**పెనుకొండ, పెన్ సత్తా, జనవరి 10:** పెనుకొండ మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సంక్రాంతి పండుగను పురస్కరించు కొని ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 14 వ తేదీ (బుధవారం) ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో మంత్రి సవిత సమక్షంలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా పెనుకొండ లోని క్యాంపు కార్యాలయంలో ముత్యాల ముగ్గుల పోటీ కరపత్రాలను మంత్రి సవిత విడుదల చేశారు. సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ సంస్కృతి, మహిళల సృజనాత్మకతను ప్రోత్సహించడమే లక్ష్యమని ఆమె తెలిపారు. ముత్యాల ముగ్గుల పోటీలో పాల్గొనే వారు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకుని టోకెన్ పొందాలని, ముగ్గుల పోటీలు అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రతి ఒక్కరూ సాంప్రదాయ దుస్తులు ధరించి రావాలని మంత్రి సవిత కోరారు. ఈ ముత్యాల ముగ్గుల పోటీల బహుమతులు గా మొదటి బహుమతి 10,000, రెండో బహుమతి 5,000, మూడో బహుమతి 3,000, అదనంగా, అందంగా ముగ్గులు వేసిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. తేదీ 14-01-2026 (బుధవారం), సమయం ఉదయం 9.00 గంటలకు, వేదిక: ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్, పెనుకొండ. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించాలని నిర్వాహకులు పిలుపు నిచ్చారు. గ్రామీణ కళలు, సంప్రదాయాలను కాపాడే ఈ కార్యక్రమాన్ని అందరూ భాగస్వాము లై విజయవంతం చేయాలని వారు కోరారు.



## గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాట్లు పరిశీలించిన యార్లగడ్డ





**గన్నవరం, పెన్ సత్తా, జనవరి 10:** గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్. గన్నవరం లోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహ ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణ పనులను గన్నవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విగ్రహాన్ని క్రేన్ సహాయంతో పీఠం పై అమర్చుతున్న ప్రక్రియను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఎన్టీఆర్ విగ్రహం గన్నవరం నడిబొడ్డున ఒక విశిష్ట గుర్తింపుగా నిలిచేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విగ్రహం చుట్టూ జరుగుతున్న ఇతర నిర్మాణ పనులను, నాణ్యతను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రారంభోత్సవానికి సమయం దగ్గరపడుతున్నందున, ఎక్కడా జాప్యం లేకుండా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువు లోగా విగ్రహాన్ని ఆవిష్కరణకు సిద్ధం చేయాలని, ఫినిషింగ్ పనుల్లో ఏమాత్రం రాజీ పడకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎన్టీఆర్ విగ్రహం గన్నవరం నియోజకవర్గానికే తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసిమోహన్, గన్నవరం టౌన్ టిడిపి అధ్యక్షులు జాస్తి శ్రీధర్, రాష్ట్ర టిడిపి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్నా, పాలడుగు నాని, బుస్సే నాగప్రసాద్, కాసర్నేని రంగబాబు, తంగిరాల శ్రీనివాసరావు, జాస్తి మురళీకృష్ణ, సూరిబోయిన రాంబాబు, మొర్ల రాంబాబు, మద్దినేని వెంకటేశ్వరరావు, ఏఈ దాసు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల 18 వ వార్షికోత్సవంలో పాల్గొన్న మన్నవ మోహన కృష్ణ








**గుంటూరు, పెన్ సత్తా, జనవరి 10:** గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కళాశాల 18 వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటిఎస్) ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ.
ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.
అనంతరం కళాశాల అధ్యాపకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం విస్తృతంగా కృషి చేస్తున్నారు. నేటి సమాజంలో వృత్తి విద్యకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరం అని మోహన కృష్ణ తెలిపారు. విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. స్పష్టమైన లక్ష్యంతో కష్టపడి చదివి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులకు మన్నవ మోహన కృష్ణ సూచించారు.

# మాటిచ్చాం నిలబెట్టుకుంటున్నాం మంత్రి సవిత.





- పెండింగ్ రోడ్లకు శాశ్వత పరిష్కారం.
- అభివృద్ధి పై వైసీపీకి బహిరంగ సవాల్.
- 5 కోట్ల 15 లక్షల రూపాయలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి సవిత.

**పెనుకొండ, పెన్ సత్తా, జనవరి 10:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న వేగవంతమైన అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు తమ పార్టీ ఉనికి కోసమే చౌకబారు విమర్శలు చేస్తున్నారని మంత్రి సవిత మండి పడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం కల్లుకుంట క్రాస్ నుంచి పెద్దగువ్వల పల్లి గ్రామం వరకు రూ.75 లక్షల నిధులతో నిర్మించిన బీటీ రోడ్డు, అలాగే నల్లూరు గ్రామం నుంచి కల్లుకుంట గ్రామానికి వెళ్లే మార్గంలో పెన్నా నది పై రూ.4 కోట్ల 40 లక్షల వ్యయంతో నిర్మించిన కాజ్ వేను మంత్రి సవిత ప్రారంభించారు. మొత్తం రూ.5 కోట్ల 15 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న కాజ్వే ప్రారంభంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి సవితకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో ఈ గ్రామానికి ఇచ్చిన హామీ మేరకు అధికారం లోకి వచ్చిన వెంటనే భూమి పూజ చేసి, కేవలం 10 నెలల వ్యవధి లోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వర్షాకాలంలో నల్లూరు గ్రామస్తులు కల్లుంటకు వెళ్లాలంటే ఎదుర్కొన్న ఇబ్బందులను తాను స్వయంగా చూశానని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం ఇవ్వాలనే సంకల్పంతో వెంటనే అధికారులతో సమన్వయం చేసి పనులు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 73 పనులు గా, 6 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీలు పనులు పూర్తి చేశాము రొద్దం నుంచి కందుకూర్లపల్లి వరకు 1 కోటి 25 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మించాము. కందుకూర్లపల్లి నుంచి చిన్నకోడిపల్లి వరకు 1 కోటి 50 లక్షలు నిధులతో రోడ్డు నిర్మించామని , రొద్దం పీహెచ్సి కి 50 లక్షల రూపాయలతో భవనం నిర్మించామని, పెదమంతురు పీహెచ్సి కి ఒక కోటి 94 లక్షల రూపాయలతో పనులు జరుగుతున్నాయని, కేజీవీబీ బిల్డింగ్‌కు 23 లక్షలు, ఎంఎస్ఎంఈ పార్క్ అభివృద్ధి కోసం 7 కోట్లు, మూడు నున్నర కోట్లతో దొడగట్ట సబ్‌స్టేషన్ కూడా పూర్తి చేశాము. దందేపల్లి నుంచి నల్లూరుకు 1 కోటి 20 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశామన్నారు. మండల వ్యాప్తంగా గోకులం షెడ్లు, పశు వులకు నీటితో పాటు మరెన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసామన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నో దశాబ్దాలుగా నిలిచిపోయిన రోడ్లను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే మరిన్ని రోడ్లకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత వైసీపీ నాయకులకు బహిరంగ సవాల్ విసిరారు. వైసీపీ నాయకులకు దమ్ముంటే రాష్ట్రంలో, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పై బహిరంగ చర్చకు రావాలి. అధికార పార్టీ పై చేస్తున్న విమర్శలు వారి రాజకీయ ఉనికి కోసమే అని ఘాటుగా వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో వలస పక్షుల్లా వచ్చి పోయే నాయకులను పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఎద్దేవా చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని త్వరలోనే అర్హులందరికీ గృహాలు, పెన్షన్లు అందజేస్తామని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# చలువ తోటలో కాశీ విశ్వనాథ ఫంక్షన్ హాల్ ప్రారంభం






- ఎమ్మెల్యే ,కార్పొరేటర్ ల చేతుల మీదుగా ప్రారంభం.
- 32 వ అభివృద్ధికి కృషి చేస్తానన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్.
- వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ డాక్టర్ కందుల వెల్లడి.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జనవరి 10:** విశాఖ దక్షిణ నియోజకవర్గం, 32 వ వార్డు పరిధిలో చలువ తోటలోని జీవీఎంసీ నిధులతో నిర్మించిన కాశీ విశ్వనాథ ఫంక్షన్ హాలు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ దక్షిణ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చురుకుగా కొనసాగుతున్నట్లు వెల్లడించారు.
ఇందులో భాగంగానే 32 వ వార్డులో ఈ ఫంక్షన్ హాల్ నిర్మించడం జరిగిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా, వారు కనుకూలంగా ఈ ఫంక్షన్ హాల్ నిర్మించి ప్రారంభించామని చెప్పారు. 32 వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ రెండు కోట్ల 60 లక్షల నిధుల అంచనా తో 32 వ వార్డు లోని చలువ తోట ప్రాంతంలో ఈ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రారంభించిన మొదటి ఫ్లోర్ కి కోటి ముప్పై లక్షల నిధులు వెచ్చించినట్లు వెల్లడించారు. మిగతా బ్యాలెన్స్ ఫ్లోర్ నిర్మాణ పనులు శర వేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజల అభీష్టం మేరకు, ఈ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఈ విషయంలో పూర్తి సహకారం అందించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.
అలాగే వార్డులో మిగతా అభివృద్ధి పనులు కూడా శరవేగంగా సాగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లు నాయుడు, ఈఈ వెంకటేశ్వర రావు, ఏఈ ప్రత్యూష, కందుల కృష్ణ, వి.శ్రీను, శాలివాహన, ఈ. అప్పారావు, వీరభద్ర, సత్యనారాయణ, ఎంఎస్ ప్రసాద్, పి.రమేష్, నేల బాబు, సిపిఎం బుజ్జి, కందుల కేదార్నాథ్, కందుల బద్రీనాథ్, కాంద్రేగుల అప్పారావు, వై.ఆది బాబు తదితరులు పాల్గొన్నారు.

# హిందూజా బొగ్గు లారీలు ఎన్టిపిసి ధూళి లారీల ను నిలుపుదల చేయాలి

సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి డిమాండ్.




**పరవాడ, పెన్ సత్తా, జనవరి 10:** లంకెలపాలెం లో హిందూజా బొగ్గు లారీలు, ఎన్టిపిసి దూళి లారీలను ఈ మార్గం మీదగా నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టడంతో పాటు గోడ పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ హిందూజా బొగ్గు లారీలు ఈ మార్గం మీదగా ప్రయాణించడం వలన తీవ్రమైన బొగ్గు ఈ రోడ్ల పై పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే ఎన్టిపిసి ఫ్లై యాష్ దూళి లారీలు, ఈ మార్గం పై కుప్పల కొలది లారీల నుంచి రోడ్ల పై రాల్చుకుంటూ లారీలు వెళుతున్నాయని, దీనివలన లంకెలపాలెం గ్రామం పూర్తిగా ధూళితో కప్పివేయ పడుతుందని, లంకెలపాలెం జంక్షన్ లో ప్రజలు ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని గనిశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీల పై ఆర్టీవో అధికారులు దాడులు నిర్వహించే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మార్గంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని అన్నారు. హిందూజా కి రైల్వే ద్వారా బొగ్గు తరలించు కోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. మహారత్న పరిశ్రమగా ఉన్న ఎన్టిపిసి ప్రజల్ని ఈ రకంగా కాలుష్యానికి గురిచేయడం అన్యాయం అన్నారు. వెంటనే బొగ్గు దూళి లారీల పై చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖాతా వెంకట్రావు, బోండా నర్సింగరావు, వి రమణ, ఎం దుర్గారావు, జి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తును నాశనం చేసే వ్యసనాలకు యువత దూరం కావాలి.







**యువతను ఉద్దేశించి ప్రసంగించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్.**

**విజయనగరం, పెన్ సత్తా, జనవరి 10:** పట్టణం గురజాడ కళా క్షేత్రంలో 'చేయూత' ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.రాము ఆధ్వర్యంలో యువజన దినోత్సవాన్ని జనవరి 10 న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిధిగా హాజరై, ముందుగా జ్యోతి ప్రజ్వలనం చేసి, వివేకానందుని చిత్ర పటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - వివేకానంద స్వామి జన్మదినానికి గుర్తుగా ప్రతీ ఏడాది యువజన దినోత్సవాన్ని నిర్వహించుకుం టున్నామన్నారు. ఈ దేశానికి యువతే వెన్నుముక, యువతే దేశాన్ని అన్ని రంగాల్లోను ముందుండి నడిపిస్తున్నారని వివేకానందుడు బలంగా విశ్వసించేవారన్నారు. వివేకానందుని స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్ళాలని, యువతలో చైతన్యం నింపాలనే సంకల్పంతో చేయూత ఫౌండేషను ఆధ్వర్యంలో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించ కోవడం, పెద్ద సంఖ్యలో యువత పాల్గొనడం అభినందనీయమన్నారు. దేశానికి వెన్నుముకగా నిలవాల్సిన యువత ఇటీవల కాలంలో దురదృష్టవసాత్తు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. మద్యం, మత్తును కలిగించే గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు లోనై, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇటీవల గంజాయి కేసుల్లో అరెస్టు అయిన వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారన్నారు. తెలిసీ, తెలియని వయస్సులో మత్తుకు బానిసలవ్వడంతోపాటు, ప్రలోభాలకు లొంగడం, వ్యసనాలకు పెద్ద సంఖ్యలో డబ్బులు అవసరం కావడంతో గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతూ, ఎన్.డి.పి.ఎస్. కేసుల్లో నిందితులుగా మారుతున్నారన్నారు. గంజాయిని వినియోగించినా, విక్రయించినా, రవాణకు పాల్పడినా చట్టాన్ని ఉల్లంఘించినట్లేనని, ఈ తరహా నేరాలకు పాల్పడితే ఏదో ఒక రోజు జైలుకు పోకతప్పదని యువతను తీవ్రంగా హెచ్చరించారు. గంజాయి పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని, తీవ్రమైన నేరంగా పరిగణించి, కఠినమైన శిక్షలను కూడా విధిస్తుందన్నారు. మనకు తెలిసిన స్నేహితుల్లో కూడా ఈ తరహా అలవాట్లు ఉంటే వారికి దూరంగా ఉండాలన్నారు. లేకుంటే వారితోపాటు మీరు కూడా క్రిమినల్ కేసుల్లో నిందితులుగా మారుతారన్నారు. ఎవరైనా గంజాయి కలిగివున్నారని గాని, సేవిస్తున్నారని గాని తెలిస్తే వెంటనే 100/112కు గాని 1972 కు గాని సమాచారం అందించాలన్నారు. చదువుకునే సమయంలో చెడు వ్యసనాలకులోనై, ఉన్నత లక్ష్యాలకు దూరమైతే వారి భవిష్యత్తు అంధకారమేనన్నారు. అదే విధంగా యువత మితిమీరిన వేగంతో వాహనాలను నడపొద్దన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాదానికి గురైనా, స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడవచ్చునన్నారు. అదే హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడిపి ప్రమాదానికి గురైతే, తలకు తీవ్రమైన గాయాలై, ప్రాణాలను కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అమ్మ మనకు జన్మనిస్తే, హెల్మెట్ పునర్జన్మ ఇస్తుందన్నారు. కావున, మీ కుటుంబ సభ్యులెవ్వరైనా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడిపితే, వారిని వారించాలని, తప్పనిసరిగా వారు హెల్మెట్ ధరించే విధంగా చూడాలన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి పొరపాటున ప్రమాదాల్లో మరణిస్తే, వారి కుటుంబం చిన్నాభిన్నమై పోతుందన్నారు. కావున, ప్రతీ ఒక్కరూ భద్రత ప్రమాణాలను పాటించాలని, మన చుట్టు ప్రక్కల వాళ్ళు కూడా భద్రత పాటించే విధంగా చూడాలన్నారు. మైనరు బాలికల అవగాహనారాహిత్యం వలన సోషల్ మీడియా ప్రభావంతో ఆకర్షణలకులోనై, లైంగిక దాడులకు గురవుతూ, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. బాలికల పై లైంగిక దాడులను నియంత్రించుటకు ప్రత్యేకంగా పోక్సో చట్టం ఉందన్నారు. మైనరు బాలికల పై ఎవరైనా లైంగిక దాడులకు పాల్పడితే వారి పై పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. సైబరు మోసాలు పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు పంపే ఎపికే ఫైల్స్, లింకులను ఓపెన్ చెయ్యొద్దన్నారు. అవగాహన రాహిత్యం వలన ప్రజలు సైబరు మోసాలకు గురవుతున్నారన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలకు పాల్పడే కేసుల్లో నేరగాళ్ళు సిబిఐ, ఎన్ఫోర్సుమెంట్ డైరెక్టరు, దర్యాప్తు సంస్థ, న్యాయమూర్తుల వేషధారణలో వాట్సాప్ కాల్స్ తో అమాయకులను భయపెట్టి, వారి నుండి డబ్బులను దోచేస్తున్నారన్నారు. ఈ తరహా కాల్స్ వస్తే ప్రజలెవ్వరూ స్పందించవద్దని, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబరు మోసాలకు గురించి 1930 కు ఫిర్యాదు చేయాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, సాంకేతికత విజ్ఞానాన్ని పెంపొందించుకొంటూ, ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ, క్రమశిక్షణ, అంకిత భావంతో ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోవాలని, తల్లిదండ్రులకు, మీ గ్రామానికి మంచి పేరును తీసుకొని రావాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆకాంక్షించారు. యువజనోత్సవాల్లో భాగంగా సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న పట్టణం లోని పలు ఎన్.జి.ఓ. ప్రతినిధులకు జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో డిటిసి డి.మణికుమార్, ఎటికె స్పిరిచువల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు ఎం.డి. కరీముల్లా షరీఫ్, ప్రముఖ సామాజిక సేవా కార్యకర్తలు వెన్నెల చంద్రశేఖర్, బి.రాజశేఖర్, ప్రముఖ రచయిత, సాహితీవేత్త ఇ.సురేష్, మై భారత్ డివైసి ఎం ప్రేమ్ భరత్ కుమార్, వన్ టౌన్ సీఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ట్రాఫిక్ సిఐ ఎస్.సూరి నాయుడు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# రాష్ట్రం లో 108 - 104 సేవలు సకాలంలో అందుతున్నాయి కొణతాల



**అనకాపల్లి, పెన్ సత్తా, జనవరి 10:** జనసేన పార్టీ కార్యాలయం మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్రంలో 108-104 సేవలు పై వైసీపీ మీడియా బురద జల్లడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పత్రికా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి దూలం గోపి, ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రి డైరెక్టర్స్ ఆళ్ల రామచంద్ర రావు, గొర్లి శేఖర్, ఉల్లింగల రమేష్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ, జనసేన పార్టీ నాయకులు తాడి రామకృష్ణ పాల్గొన్నారు. ఆళ్ల రామచంద్ర రావు మాట్లాడుతూ రాష్ట్రం లో ఉన్న 108 సేవలు పై ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నారు, శ్రీకాకుళం, నంద్యాల లో అంబులెన్సు సేవలు ఆలస్యం వల్లే క్షతగాత్రుల ప్రాణాలు పోయాయి అని, అంబులెన్సులు అన్నీ షెడ్డులో ఉన్నాయి అని తప్పుడు కధనలు రాస్తున్నారు అని, అది మనసాక్షి లేని పత్రిక అని, కేవలం వైసీపీ కరపత్రిక గా పని చేస్తుంది అని అన్నారు. దూలం గోపి మాట్లాడుతూ రాష్ట్రం లో కానీ జిల్లాలో కానీ 108, 104 సేవలు సకాలంలో అందుతున్నాయి అని అందుకు ఉదాహరణ అనకాపల్లి జిల్లాలో ఉన్న 23 అంబులెన్సులు ఒక్కటి కూడా కనీసం రిపేర్ లో కూడా లేవు అని, సిబ్బందికి జీతాలు దగ్గర నుండి మైంటైనెన్స్ కూడా సకాలంలో నిర్వహిస్తూ పేద ప్రజలకు సేవలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు అని అన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కానీ నిరంతరం దీని పై సమీక్షలు నిర్వాహస్తూనే ఉన్నారు అని, 108 సర్వీస్ కు సంబందించి ట్రాకింగ్ విధానం కూడా అమలు చేస్తున్నారు. గడిచిన 6 నెలలు లోనే కేవలం అనకాపల్లి జిల్లా లోనే 14,000 మందికి సేవలు అందించింది అని, అత్యవసర వైద్యం కోసం ఇతర ఆసుపత్రికి తరలించాల్సి వచ్చిన కేసులు 6 నెలల వ్యవది లో 6,600 పైగా సేవలు అందించింది అని, 104 సేవలకు సంబందించి ఇప్పటికే 5 లక్షల పైగా స్క్రినింగ్ టెస్టులు నిర్వహిస్తూ సేవలు అందిస్తున్నారు అన్నారు. రాబోవు రోజులలో దాదాపుగా 41 టెస్టులను 104 ద్వారా చేయనున్నారు అని అన్నారు. ఇంత చక్కగా నిర్వహిస్తున్న కూడా దుష్ప్రచారం చేయడం కేవలం అరబిందో సంస్థ కి కాదు అని వేరే సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వల్లనే అని, ఇలాంటి ధోరణి మార్చు కోవాలి అని అన్నారు. ఇప్పటికి 102 సేవలు అరబిందో నిర్వహిస్తున్నది వాటిలో సిబ్బందికి జీతాలు లేక, బండికి మైంటైనెన్స్ లేక ఇబ్బంది పడుతున్నారు అని, కేవలం ఒక్క అనకాపల్లి లోనే 7 వాహనాలకు 2 వాహనాలు పని చేయని స్థితిలో ఉన్నాయి అని, కానీ గత ప్రభుత్వం లోనే ఈ 102 సేవలు నిర్వహణ అరబిందో కు అప్పగించగా ఇంకా వారికీ కాల పరిమితి 3 నెలలు ఉన్నాది అని అన్నారు. ఒక్కసారి గమనిస్తే వాటి నిర్వహణ కి 108, 104 సేవల నిర్వహణకి వ్యత్యాసం క్షుణ్ణంగా కనిపిస్తుంది అని వైసీపీ మీడియా కానీ, ఆ పార్టీ నేతలు కానీ ఇప్పటికి ఐన బుద్ధి తెచ్చుకోవాలి అని, ప్రజలు తిరస్కరించిన కూడా వారి లో ఏ మార్పు లేదు అని, ఎల్లపుడు ప్రజల్లో ఏదో భయందోళన కల్గించాలి అని చూస్తున్నారు అని ఇది సరైన విధానం కాదు అని అన్నారు.

# హాస్పటల్ అధికారులు, అభివృద్ధి కమిటీ తో సమీక్ష నిర్వహించిన కొణతాల





**అనకాపల్లి, పెన్ సత్తా, జనవరి 10:** ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్ నందు నూతనంగా ఆర్వైచ్ఐ మిగ్నేసిత ఇండియా లిమిటెడ్ సహకారంతో నిధులు 1 కోటి 40 లక్షల రూపాయలతో డి అడిక్షన్ సెంటర్, మదర్ ఫీడింగ్ అండ్ వెయిటింగ్ హాల్, మోడరన్ మార్చురీ రూమ్, మూడు భవనాల మంజూ రైన సందర్భంగా శనివారం హాస్పటల్ అధికారులతో అభివృద్ధి కమిటీ తో సమీక్ష నిర్వహించిన మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ. ఈ నూతనంగా నిర్మించే భవనాలు యొక్క ప్లానింగ్ సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. అనంతరం హాస్పిటల్ కి సంబంధించి, వివిధ ప్రాంతాలను వచ్చే పేషెంట్లకు ప్రైవేట్ హాస్పిటల్ దీటుగా సక్రమంగా, మెరుగైన వైద్యం అందివ్వాలని, వైద్యానికి సరిపడే మందులు అందించాలని అలాగే ఔషధాలు లోటు లేకుండా భర్తీ చేస్తూ ఉండాలని, హాస్పిటల్ పరిసరాల, రూములు, టాయిలెట్స్, పరిశుభ్రంగా ఉంచాలని, ముఖ్యంగా పరిశుభ్రత విషయంలో ఉపేక్షించేది లేదని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి డిఎంహెచ్ ఓ డాక్టర్ హైమావతి, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు, తాడి శాంతి కుమారి రామకృష్ణ, గొర్లి శేఖర్, డాక్టర్ డి డి నాయుడు, ఉల్లింగల రమేష్ పాల్గొన్నారు.

# అర్జీలను పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి చింతమనేని









**దుగ్గిరాల, పెన్ సత్తా, జనవరి 10:** ప్రజల నుంచి వచ్చిన వినతుల అర్జీలను పరిష్కరించేలా సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని, అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో సాంకేతిక లోపాలు ఉన్నప్పుడు వాటిని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా స్థానిక అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాల లోని క్యాంపు కార్యాలయంలో ఉదయం పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుత్యాలందించి, పలు ఆహ్వాన పత్రికలు అందచేసారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే చింతమనేని సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.

# కార్పొరేటర్లు, జనసేన, అధికారులతో సమీక్ష కార్యక్రమంలో పంచకర్ల



**పెందుర్తి, పెన్ సత్తా, జనవరి 10:** నియోజకవర్గం జీవీఎంసీ జోనల్ అధికారులు, వార్డు కార్పొరేటర్లు, వార్డ్ అధ్యక్షులతో సమీక్ష కార్యక్రమం నిర్వహించిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. శనివారం పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో మిర్వహించిన సమీక్ష సమావేశంలో శాసనసభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జీవీఎంసీ వార్డుల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, గత ప్రభుత్వములో పూర్తిగా అభివృద్ధిని పక్కనపెట్టి వైసిపి కార్పొరేటర్లు ఉన్న కొన్ని చోట్ల నామమాత్రంగా కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేశారని అన్నారు. వివిధ నియోజకవర్గాల్లోని శాసనసభ్యులతో జీవీఎంసీ కమిషనర్ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా పెందుర్తి నియోజకవర్గానికి గాను ఈనెల 20 వ తారీకున కమీషనర్ తో సమీక్ష సమావేశం ఉన్నందున, వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షులు తమ తమ వార్డుల్లో ఏ ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది, ముందుగా యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులు, వాటి ఎస్టిమేషన్లను ఈ నెల 20 వ తారీకు లోపు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం మూడు పార్టీల కలయిక అయినప్పటికీ, అభివృద్ధిలో మాత్రం అందరిదీ ఒకటే మాట అన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావు లేదని, ఈ రాష్ట్రం లోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు. దీనికి అందరి సహాయ సహకారాలు అవసరమని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జోనల్ కమిషనర్ శంకర్రావు, అగనంపూడి జోనల్ కమిషనర్ మనీషా త్రిపాఠి, 77 వార్డు కార్పొరేటర్లు బుట్టా సూర్య కుమారి, 85 వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, 97 వార్డ్ కార్పొరేటర్ సేనాపతి వసంతా శంకరరావు, 79 వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస రావు, 93 వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, 94 వార్డు కార్పొరేటర్ బల్లా శ్రీనివాస రావు, పెందుర్తి పిఎసిఎస్ చైర్మన్ అయిత సింహాచలం, సీనియర్ నాయకులు ఇందల రమణ, దుళ్ల రాము నాయుడు, సేనాపతి శంకర్రావు, దాట్ల మధు, గల్లా శ్రీనివాస రావు, ఇల్లపు ప్రసాద్, వార్డు అధ్యక్షులు కాకి బాబు, గవర సోమశేఖర్, పిల్లా శివకృష్ణ, ఒబ్బిన జనార్ధన్ శ్రీకాంత్, పిన్నింటి పార్వతి, సేనాపతి సోమశేఖర్, కంచిపాటి మధు, డి బి ఎల్ సంతోష్, మజ్జి సూరిబాబు, కోరుకొండ వరహాలు, జీవీఎంసీ ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## ఇన్వెస్టర్లకు హెచ్చరిక: 5 ఏళ్లుగా మంచి లాభాలు సంపాదించారా..? అయితే మునిగిపోతారు జాగ్రత్త




జీవితంలో డబ్బు సంపాదించడం ఒక ఎత్తు అయితే.. ఆ వచ్చిన డబ్బును నిలబెట్టుకోవడం మరో పెద్ద పని. ప్రపంచంలో చాలా మంది డబ్బు సంపాదిస్తారు కానీ కొందరి వద్దే అది నిలబడటానికి కారణం దాన్ని వృద్ధి చేసే అలాగే హోల్డ్ చేసే టాలెంట్ చాలా మంది వద్ద లేకపోవటమే. చాలా మందికి ఆర్థిక రంగంలో కొన్ని ఏళ్ల అనుభవం రాగానే తాము అంతా నేర్చేసుకున్నామనే అతివిశ్వాసం మొదలవుతుంది. సరిగ్గా ఇదే పాయింట్ వద్ద ఇన్వెస్టర్లు తమ జీవితంలో అతిపెద్ద ఫైనాన్షియల్ మిస్టేక్స్ చేస్తుంటారని అన్నారు జాక్టర్ మనీ వ్యవస్థాపకులైన సీఏ అభిషేక్ వాలియా. 5 ఏళ్ల పాటు వరుసగా లాభాలు రావడం లేదా ఆదాయం పెరగడం అనేది ఒక ఇన్వెస్టర్‌కు అత్యంత ప్రమాదకరమైన సమయమని సీఏ హెచ్చరిస్తున్నారు.సాధారణంగా ఒక వ్యక్తి ఐదేళ్ల పాటు మార్కెట్లో మంచి రాబడిని చూసినప్పుడు.. తన నిర్ణయాలన్నీ సరైనవేనని బలంగా నమ్ముతుంటాడు. మార్కెట్ పరిస్థితులు అనుకూలించడం వల్ల వచ్చిన లాభాలను తన మేధస్సు వల్ల వచ్చినవిగా భావించడం ఇక్కడే మొదలవుతుంది. ఈ దశలో ఇన్వెస్టర్లు తమ శక్తికి మించి రిస్క్ తీసుకోవడం ప్రారంభిస్తారు. ఆదాయం స్థిరంగా పెరుగుతోంది కదా అన్న ధీమాతో భారీగా అప్పులు చేయడం, లగ్జరీ వస్తువుల కోసం ఖర్చు చేయడం లేదా అత్యంత రిస్క్ ఉన్న పథకాల్లో భారీగా పెట్టుబడి పెట్టడం వంటివి చేస్తుంటారని సీఏ హెచ్చరించారు. భవిష్యత్తు కూడా గడిచిన ఐదేళ్లలాగే సాఫీగా సాగుతుందని వారు భ్రమపడి ఆర్థిక చిక్కుల్లో ఇరుక్కుంటుంటారని అన్నారు.కానీ ఫైనాన్షియల్ మార్కెట్లు ఎప్పుడూ ఒకే దిశలో పయనించవని ఇన్వెస్టర్లు గురించారన్నారు సీఏ. మార్కెట్ సైకిల్ మారినప్పుడు లేదా ఆదాయ వనరులు తగ్గినప్పుడు, అప్పటివరకు సౌకర్యవంతంగా అనిపించిన అప్పులే భారంగా మారుతాయన్నారు. ఓవర్ కాన్ఫిడెన్స్ తో చేసిన పెట్టుబడులు నష్టాలను మిగిల్చినప్పుడు ఇన్వెస్టర్లు కోలుకోలేని దెబ్బ తింటారని పేర్కొన్నారు. ఐదేళ్ల విజయం వచ్చే ఇరవై ఏళ్ల భవిష్యత్తును నిర్ణయించలేదని చాలా మంది ఆలస్యంగా గుర్తిస్తారని.. ముఖ్యంగా ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియో అగ్రెసివ్‌గా ఉన్నప్పుడు మార్కెట్ కరెక్షన్ కు లోనైతే ఆ షాక్‌ను తట్టుకునే కుషన్ లేకపోవడం వల్ల భారీగా నష్టపోతారని వివరించారు.నిజమైన విజయవంతమైన ఇన్వెస్టర్లు భిన్నంగా ఆలోచిస్తారని అభిషేక్ వాలియా వివరిస్తున్నారు. విజయాన్ని చూసి పొంగిపోరు, అలాగే ఓవర్ కాన్ఫిడెన్స్ తో అప్పులు పెంచుకోరని చెప్పారు. మార్కెట్లు ఎంత లాభాలను ఇస్తున్నప్పటికీ వారి ప్రవర్తన మాత్రం చాలా కన్జర్వేటివ్ గానే ఉంటుందన్నారు. వారు ఎప్పుడూ అనుకోని పరిస్థితులకు సిద్ధంగానే ఉంటారన్నారు. ఆర్థిక రంగంలో 'వినయం' అనేది మెమెంటం కంటే ఎక్కువ కాలం నిలుస్తుందని తేల్చి చెప్పారు. వేగం ఎప్పుడైనా ఆగిపోవచ్చు.. కానీ వినయం ఉన్న ఇన్వెస్టర్ మార్కెట్ ఒడిదుడుకులకు లోనైనప్పుడు పానిక్ అవ్వకుండా.. దీర్ఘకాలిక లక్ష్యాల వైపు స్థిరంగా పయనించగలడన్నారు. ఐదేళ్ల విజయం మీకు పాఠాలు నేర్పవచ్చు, కానీ అంతా నేర్చేసుకున్నామనే భ్రమలో ఉంటే మాత్రం అది భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకునేలా చేస్తుందని ఇన్వెస్టర్ల మైండ్ సెట్ మిస్టేక్స్ వల్ల నష్టపోతున్న తీరు గురించి చెప్పారు

## డిజిటల్ ఎకానమీ దిశగా నేపాల్.. కొత్త క్యాష్ పేమెంట్ రూల్స్.. మారిన లిమిట్స్




నేపాల్ ప్రభుత్వం తన ఆర్థిక వ్యవస్థలో పారదర్శకతను పెంచే దిశగా సంచలన నిర్ణయం తీసుకుంది. జనవరి 15 నుంచి డబ్బు వినియోగం గురించి కొత్త రూల్స్ అమలులోకి తీసుకొస్తోంది నేపాల్. వస్తుసేవల క్రయవిక్రయాలకు సంబంధించి నగదు లావాదేవీలపై పరిమితిని విధించింది. ఇకపై నేపాల్‌లో ఏ వ్యక్తి అయినా.. లేదా సంస్థ అయినా ఒక ట్రాన్సాక్షన్ లో 5 లక్షల నేపాలీ రూపాయలకు మించి క్యాష్ నేరుగా చెల్లించడానికి వీలుండదు. దీనికంటే పెద్ద మొత్తంలో చెల్లింపులు చేయాలంటే తప్పనిసరిగా బ్యాంకింగ్ వ్యవస్థ లేదా డిజిటల్ పేమెంట్ వ్యవస్థలను ప్రజలు వాడాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.నేపాల్ ఈ కఠిన నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం అంతర్జాతీయ ఒత్తిడితో పాటు అంతర్గత ఆర్థిక భద్రత సమస్యలే. ప్రస్తుతం నేపాల్ అంతర్జాతీయ మనీ లాండరింగ్ నిరోధక సంస్థ గ్రే లిస్ట్లో ఉంది. దేశంలో ఆర్థిక కార్యకలాపాల్లో మనీ లాండరింగ్, ఉగ్రవాద నిధుల సరఫరాను అరికట్టడానికి 'మనీ లాండరింగ్ నిరోధక చట్టం, 2008' కింద ఈ నగదు పరిమితిని విధించారు. గతంలో ఈ నగదు లావాదేవీల పరిమితి 10 లక్షల రూపాయలుగా ఉండగా.. ప్రస్తుతం దానిని సగానికి తగ్గిచటం జరిగింది. నేపాల్ సెంట్రల్ బ్యాంక్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. కంపెనీలు, సంస్థలు లేదా కార్యాలయాల పేరుతో జారీ అయ్యే చెక్కులు తప్పనిసరిగా 'అకౌంట్ పేయీ' మాత్రమే అయి ఉండాలి. అంటే ఆ నగదు నేరుగా సంబంధిత వ్యక్తి లేదా సంస్థ ఖాతాలోకే జమ అవుతుంది. అయితే ఈ రూల్ నుంచి ప్రభుత్వం కొన్ని మినహాయింపులు కూడా ఇచ్చింది. బ్యాంకుల్లో నగదు డిపాజిట్ చేయడం, తీసుకున్న రుణాల అసలు వడ్డీ చెల్లించడం, ఆర్థిక సంస్థల మధ్య జరిగే అంతర్గత లావాదేవీలకు ఈ 5 లక్షల పరిమితి వర్తించదని నేపాల్ వెల్లడించింది.అంతేకాకుండా సరైన కారణంతో పాటు డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనే వివరాలు చూపిస్తే దేశంలో భారీగా నగదును తీసుకెళ్లేవారికి ఎటువంటి ఆంక్షలు ఉండవు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా డిపాజిటర్ పరిమితికి మించి నగదు కావాలని దరఖాస్తు చేసుకుంటే.. బ్యాంకులు ఆ కారణం సరైనదిగా భావిస్తే డబ్బు ఇవ్వొచ్చు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు నేపాల్ వేగంగా అడుగులు వేస్తోందనడానికి తాజా పరిస్థితులు చెప్పకనే చెబుతున్నాయి. క్యాష్ వినియోగాన్ని తగ్గించి.. ప్రతి పైసా లెక్కలోకి వచ్చేలా చేయడం ద్వారా దేశ ఆర్థిక పురోగతికి బాటలు వేయాలని నేపాల్ ప్రభుత్వం భావిస్తోంది.

## రష్యా అధ్యక్షుడు పుతిన్‌ని కూడా వెనిజులా మదురోలా ఎత్తుకెళతారా..? ట్రంప్ కీలక కామెంట్స్..

వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా బలగాలు బంధించి.. విచారణ పేరుతో అమెరికాకు తరలించిన సంగతి తెలిసిందే. అయితే ఈ నేపథ్యంలో.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విషయంలోనూ అటువంటి సాహసోపేతమైన చర్య తీసుకునే అవకాశం ఉందా? రష్యా లాంటి దేశంపై ట్రంప్ ఇలాంటి ఆలోచన కలలో కూడా చేయగలరా అనే ప్రశ్నలు కూడా సోషల్ మాడియాలో ఉన్న సంగతి తెలిసిందే. ఇలాంటి ప్రశ్నలకు ట్రంప్ ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. పుతిన్‌ను బంధించేందుకు ఎటువంటి ప్రత్యేక సైనిక చర్య అవసరం ఉంటుందని తాను అనుకోవడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. గతంలో పుతిన్‌తో తనకు ఉన్న సంబంధాలను గుర్తు చేసుకుంటూ.. ఆయనతో నాకు ఎప్పుడూ మంచి సంబంధాలే ఉండేవి అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుత రష్యా తీరుపై ఆయన అసంతృప్తిని కూడా వ్యక్తం చేశారు. పుతిన్ ప్రవర్తన నాకు చాలా నిరాశ కలిగించిందంటూనే.. పుతిన్‌ను పట్టుకోవాల్సిన అవసరం రాకపోవచ్చని ట్రంప్ అన్నారు.

# భోగి పండుగ జనవరి 14.. మళ్లీ 2040 దాకా ఇలాంటి రోజు రాదు..!

**సంక్రాంతి పండుగ వచ్చిందంటే సిటీ జనాలు ఊళ్ల బాట పడతారు. 24 గంటలు రద్దీగా ఉండే పట్టణాలు ఒక్కసారిగా వెలవెలబోయి సిటీల్లో మార్పు కనిపిస్తుంది. ఒక్క సిటీలోనే కాదు సంక్రాంతి పండుగ సమయంలో ప్రకృతిలో కూడా మార్పులొస్తాయి. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన సమయం ఆధారంగా సంక్రాంతి పండుగ జరుపుకుంటారు. ఆ రోజుకు ముందు రోజు భోగి పండుగను ఎంతో వైభవంగా జరుపుకుంటారు. కాని ఈ ఏడాది భోగి రోజు ( జనవరి 14)కు చాలా విశిష్టత ఉందని పండితులు చెబుతున్నారు. మళ్లీ ఇలాంటి రోజు 2040 వరకు రాదని చెబుతున్నారు. ఈ ఏడాది భోగి రోజుకు ఉన్న విశిష్టత గురించి తెలుసుకుందాం...!**



సంక్రాంతి పండుగ కాలంలో సూర్యుడు దక్షణయానం నుంచి ఉత్తరాయానంలోకి ప్రవేశిస్తాడు. ఈ మార్పుతో పాటు వాతావరణంలో చలి తీవ్రత పెరుగుతుంది. చలిని ఎదుర్కొనే సంప్రదాయంగా భోగి మంటలు వేయడం ద్వారా సంక్రాంతి ఉత్సవాలు మొదలవుతాయి. ఈ రోజునే భోగి పండుగగా జరుపుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా ఈ ఆచారం ఎక్కువగా కనిపిస్తుంది. చలి తగ్గాలని కోరుకోవడం మాత్రమే కాకుండా పాతవి వదిలి కొత్త జీవితానికి స్వాగతం పలకడం అనే భావన కూడా ఈ మంటల వెనుక ఉంది.

2026 సంవత్సరంలో భోగి పండుగకు మరింత ప్రత్యేకత ఏర్పడింది. ఈ ఏడాది భోగి రోజునే పుష్య మాసం కృష్ణ పక్షం ఏకాదశి తిథి ప్రారంభమవుతుంది. జనవరి 13 సాయంత్రం 3 గంటల 18 నిమిషాల నుంచి ఈ ఏకాదశి తిథి ప్రారంభమై జనవరి 14 సాయంత్రం 5 గంటల 53 నిమిషాల వరకు కొనసాగుతుంది. ఈ ఏకాదశిని షట్తిల ఏకాదశిగా పిలుస్తారు. భోగి పండుగ మరియు ఏకాదశి ఒకే రోజున కలసి రావడం చాలా అరుదైన సంఘటనగా పండితులు చెబుతున్నారు..

**భోగి రోజే షట్తిల ఏకాదశి**

భోగి రోజున కొన్ని నియమాలు పాటించడం ఆనవాయితీ. కానీ ఈసారి ఏకాదశి కూడా కలసి రావడంతో ఈ దినానికి మరింత ఆధ్యాత్మిక విలువ ఏర్పడింది. ఉపవాసం ఉండడం, విష్ణు పూజ చేయడం వంటి ఆచారాలు ఈ రోజున చేయడం శుభప్రదంగా భావిస్తారు.

**తులసి వనంలో గోదాదేవి..**

భోగి పండుగకు గోదాదేవి చరిత్ర కూడా బలంగా ముడిపడి ఉంది. సూర్యుడు ధనుర్మాసంలో ప్రవేశించిన రోజునే తులసి వనంలో గోదాదేవి అవతరించినట్లు పురాణ కథనం. ఆమె బాల్యంలోనే విష్ణుమూర్తి పట్ల భక్తి పెంచుకుని, పెద్దయ్యాక ఆయనను తప్ప మరెవ్వరినీ వివాహం చేసుకోనని నిర్ణయించుకుంది. పెద్దలు ఆమె సంకల్పాన్ని గౌరవించి విష్ణుమూర్తికే వివాహం చేయాలని నిర్ణయించారు.

గోదాదేవి తన కోరిక నెరవేరాలనే భావంతో ధనుర్మాసం మొత్తం 30 రోజుల పాటు ప్రతిరోజూ పాశురాలు పాడుతూ, పొంగలి మాత్రమే నైవేద్యంగా స్వీకరిస్తూ తపస్సు చేసినట్లు చెబుతారు. ఈ విధంగా 30 రోజులు గడిచిన తరువాత రంగనాథుడు ప్రత్యక్షమై ఆమెను వివాహం చేసుకుంటానని వరమిచ్చాడు. పెద్దల సమ్మతితో రంగనాథపురంలో రంగనాథుడు ... గోదాదేవిల వివాహం ఘనంగా జరిగిందని పురాణాల ద్వారా తెలుస్తుంది. ఈ సంఘటన భోగి పండుగ రోజున జరిగినట్లు సంప్రదాయం చెబుతుంది. అందుకే భోగి రోజున అనేక ఆలయాల్లో గోదా కళ్యాణం నిర్వహిస్తారు.

**ఉపవాస నియమం..**

ఈ ఏడాది ( 2026) భోగి రోజునే షట్తిల ఏకాదశి రావడంతో కొన్ని ప్రత్యేక ఆచారాలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ రోజున ఉపవాస నియమం పాటించడం ఎంతో శుభప్రదమని చెబుతారు. అలాగే నువ్వుల పిండి లేదా నువ్వుల నూనెను శరీరానికి పూసుకుని స్నానం చేయడం, స్నాన జలంలో నల్ల నువ్వులు కలపడం మంచి ఫలితాలు కలుగుతాయని శాస్త్రాల ద్వారా తెలుస్తుంది. ఈ విధంగా చేయడం వల్ల జాతకంలోని దోషాలు తొలగి అంతా శుభం కలుగుతుందని పండితులు చెబుతున్నారు.

**భోగి మంటలకు..**

ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే భోగి మంటలకు ప్రత్యేక అర్థం ఉందని పండితులు చెబుతారు. దక్షణయాన కాలంలో ఎదురైన కష్టాలు తొలగి, ఉత్తరాయాణంలో మంచి రోజులు ప్రారంభమవాలని కోరుకుంటూ ఈ మంటలు వేస్తారని విశ్వాసం. అందుకే భోగి పండుగను కేవలం ఆచారంగా కాకుండా ఆత్మశుద్ధి దినంగా కూడా భావిస్తారు.

షట్తిల ఏకాదశి రోజున నువ్వులను ఏదో ఒక రూపంలో ఆహారంగా తీసుకోవడం ప్రత్యేకంగా చెప్పబడింది. అలాగే నువ్వులను దానం చేయడం కూడా ఈ రోజున విశిష్టంగా భావిస్తారు. విష్ణు సహస్రనామ పారాయణం చేయడం, విష్ణుమూర్తిని స్మరించడం ఈ ఏకాదశి రోజున మరింత పుణ్యదాయకమని పండితులు సూచిస్తున్నారు.

**వామన అవతారంలో..**

భోగి మంటల వెనుక పురాణ గాథ కూడా ప్రసిద్ధి చెందింది. వామన అవతారంలో వచ్చిన శ్రీమహావిష్ణువు బలి చక్రవర్తిని పాతాళానికి పంపిన తరువాత అతనికి ఒక వరం ఇచ్చినట్లు పురాణాలు చెబుతాయి. ఆ వరం ప్రకారం బలి చక్రవర్తి పాతాళానికి రాజుగా ఉండాలి. అలాగే ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగకు ముందు అంటే భోగి రోజున భూలోకానికి వచ్చి ప్రజలను దర్శించి ఆశీర్వదించాలి అని విష్ణువు అనుగ్రహించినట్లు కథనం. అందుకే సంక్రాంతికి ముందు రోజు భోగి మంటలు వేసి బలి చక్రవర్తిని ఆహ్వానించే సంప్రదాయం ఏర్పడిందని పురాణాల ద్వారా తెలుస్తుంది. . !

# పూణే రియల్ ఎస్టేట్ బబుల్.. రూ.కోటి 80లక్షలు ఉన్న ఫ్లాట్ రెండు వారాల్లో రూ.2 కోట్లు అయ్యింది




పూణేలో రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పెరుగుతున్న రేట్లు, స్పీడు ఇప్పుడు సామాన్యులకు చుక్కలు చూపిస్తోంది. కేవలం 15 రోజుల్లోనే ఒక ఫ్లాట్ ధర ఏకంగా రూ. 20 లక్షల వరకు పెరగడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కునాల్ గాంధీ అనే నెటిజన్ ఎక్స్ వేదికగా పంచుకున్న తన అనుభవం మెట్రో నగరాల్లో రియల్ ఎస్టేట్ బబుల్ ఏ స్థాయిలో ఉందో అద్దం పడుతోంది.

కునాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పూణేలో ఒక కొత్త ప్రాజెక్ట్ లాంచ్ అయిన సమయంలో 3దీఎఖ ఫ్లాట్ కోసం వెళ్లినప్పుడు బిల్డర్ రూ. కోటి 80లక్షలు కోట్ చేశారని వెల్లడించారు. సరిగ్గా రెండు వారాల తర్వాత మళ్ళీ వెళ్తే.. అదే ఫ్లాట్ ధర రూ.కోటి 95లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. నిన్న మరోసారి వాకబు చేస్తే ఆ ధర రూ. 2 కోట్లకు చేరుకుందని.. వచ్చే నెలకల్లా అది రూ. 2కోట్ల 15 లక్షలు అవుతుందని రియల్టర్లు చెబుతున్నట్లు తన ట్వీటులో వివరించారు. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు ఇది నిజమైన డిమాండ్ వల్ల జరుగుతోందా లేక కృత్రిమంగా సృష్టించిన కొరత అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది నెటిజన్లు బిల్డర్ల మాయాజాలాన్ని తప్పుపడుతున్నారు. కేవలం 80 శాతం ప్రాజెక్ట్ అమ్ముడైపోయిందని తప్పుడు ప్రచారం చేస్తూ.. లేని డిమాండ్ సృష్టించి రేట్లు పెంచుతున్నారని ఆరోపిస్తున్నారు. ఉద్యోగులకు జీతాలు పెరగడం లేదు కానీ.. ఆస్తుల విలువ మాత్రం రాకెట్ వేగంతో దూసుకుపోతోందని, ఇది సామాన్యుడిని కోలుకోలేని అప్పుల ఊబిలోకి నెట్టేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మాత్రం అధిక జీతాలున్న వారి కొనుగోలు శక్తి పెరగడం వల్లే ఇలా ఎడాపెడా రేట్లు పెరిగిపోతున్నాయని అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద పూణే రియల్ ఎస్టేట్ రేట్ల వేగం ఇప్పుడు దేశవ్యాప్త చర్చకు దారితీసింది.

# శ్రీధర్ వెంబు విడాకుల కేసు.. భార్య ఆరోపణలు.. జోహో వెంబు వివరణ.. అసలేం జరుగుతోంది?



దేశీయ టెక్ కంపెనీ జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు.. ఆయన భార్య ప్రమీలా శ్రీనివాసన్ మధ్య జరుగుతున్న విడాకుల పోరాటం ప్రస్తుతం కార్పొరేట్ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. సుమారు 5 బిలియన్ డాలర్లు దాదాపు రూ. 45వేల కోట్లకు పైగా విలువైన సాఫ్ట్‌వేర్ సామ్రాజ్యంలో వాటాలకు సంబంధించి జరుగుతున్న ఈ న్యాయపోరాటం.. ఇప్పుడు రూ. 15వేల కోట్ల విలువైన బాండ్ల చుట్టూ తిరుగుతోంది. సామాన్యులకు సైతం ఆశ్చర్యం కలిగించే రీతిలో.. ఒక విజయవంతమైన బిజినెస్ మెన్ పర్సనల్ లైఫ్ అలాగే కంపెనీ ఆస్తుల మధ్య జరుగుతున్న ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

అసలు వివాదంలోకి వెళితే.. శ్రీధర్ వెంబు తన వద్ద ఉన్న జోహో కంపెనీ షేర్లను తన భార్యకు తెలియకుండా రహస్యంగా తన బంధువులకు, ఇతరులకు ట్రాన్స్ ఫర్ చేశారని ప్రమీల ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కంపెనీలో ఆమెకు రావాల్సిన వాటాను దక్కనివ్వకుండా చేసేందుకే ఈ ఆర్థిక లావాదేవీలు జరిగాయని అమెరికా కోర్టులో వాదిస్తున్నారు. ఈ క్రమంలోనే సుమారు రూ. 15వేల కోట్ల విలువైన ఆర్థిక లావాదేవీలు, బాండ్ల బదిలీ అంశం తెరపైకి వచ్చింది. ఒకప్పుడు ఆదర్శ దంపతులుగా పేరున్న వీరి మధ్య.. ఇప్పుడు ఆస్తుల పంపకం, నమ్మకద్రోహం అనే అంశాలపై తీవ్రమైన చర్చ జరుగుతోంది.

మరోవైపు శ్రీధర్ వెంబు ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తాను ఎప్పుడూ తన భార్యకు లేదా తన కుమారుడికి అన్యాయం చేయలేదని కేవలం తనపై బురదజల్లేందుకే ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వాదిస్తున్నారు. తన సోదరులు, ఇతర కుటుంబ సభ్యులకు షేర్ల బదిలీ అనేది చట్టబద్ధంగానే జరిగిందని ఆయన సమర్థించుకుంటున్నారు. కంపెనీ ఎదుగుదల కోసం తీసుకున్న నిర్ణయాలను వ్యక్తిగత కక్షలకు వాడుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ గొడవ వల్ల జోహో వంటి ప్రతిష్టాత్మక కంపెనీ ప్రతిష్ట దెబ్బతింటోందని ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసు అమెరికాలోని కాలిఫోర్నియా కోర్టులో విచారణలో ఉంది. ఆటిజంతో బాధపడుతున్న తన కుమారుడి భవిష్యత్తు కోసం తాను పోరాడుతున్నానని ప్రమీల చెబుతుండగా.. ఇది కేవలం డబ్బు కోసం జరుగుతున్న డ్రామా అని వెంబు వర్గం కొట్టిపారేస్తోంది. సోషల్ మీడియాలో నెటిజన్లు కూడా రెండు వర్గాలుగా విడిపోయి చర్చిస్తున్నారు. ఒక స్టార్టప్ వ్యవస్థాపకుడి వ్యక్తిగత జీవితం కంపెనీ భవిష్యత్తును ఎలా ప్రభావితం చేస్తుందనే దానికి ఈ వివాదం ఒక నిదర్శనంగా నిలిచింది. రూ. 15వేల కోట్ల 'బాండ్ల వివాదం చివరకు ఎటు వైపు మలుపు తిరుగుతుందో అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## యువత పెడతోవ పట్టకుండా క్రీడల్లో రాణించాలి

విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సంకబ్రత బాగ్చి





**విశాఖపట్నం, పెన్ సత్తా, జనవరి 10:** యువత తమ శక్తిసామర్థ్యాలను సన్మార్గంలో మళ్లించి, క్రీడల ద్వారా క్రమ శిక్షణను అలవర్చు కోవాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సంకబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. పెందుర్తి నియోజకవర్గం, వేపగుంట సమీపం లోని 95 వ వార్డు పొర్లుపాలెం మైదానంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన సంక్రాంతి ప్రీమియర్ లీగ్ (ఎస్పిఎల్) క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. పొర్లుపాలెం, చింతలఅగ్రహారం, చీమలాపల్లి, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన యువత ఐకమత్యంతో ఈ క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మైదానంలో క్రీడాకారులను ఉద్దేశించి సీపీ ప్రసంగిస్తూ పండుగ వేళల్లో యువత సమయాన్ని వృథా చేయకుండా, వ్యసనాలకు లోను కాకుండా ఇలా క్రీడల పట్ల ఆసక్తి చూపడం ఎంతో ఆనందదాయకమని హర్షం వ్యక్తం చేశారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదు, అవి శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో తోడ్పడతాయి. గెలుపోటములను సమానంగా తీసుకునే క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి అని ఆయన సూచించారు. విశాఖ నగరంలో శాంతి భద్రతల పరి రక్షణకు పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఈ క్రమంలో యువత పోలీసులకు సహకరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని కోరారు. అనంతరం మైదానంలో టాస్ వేసి పోటీలను ప్రారంభించిన సీపీ, స్వయంగా బ్యాట్ పట్టి కాసేపు పిచ్ పై బ్యాటింగ్ చేసి అలరించారు. సీపీ ఉత్సాహంగా బ్యాటింగ్ చేయడంతో క్రీడాకారులు, స్థానిక యువత కేరింతలతో మైదానాన్ని హోరెత్తించారు. యువతను ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కాళ్ళ సంతోష్, జిటిపిఎల్ జిటివీ మేనేజింగ్ డైరెక్టర్ రాపర్తి అప్పలరాజు, పాల్గొన్నారు. వివిధ జట్ల కెప్టెన్లు చల్లా ప్రసాద్, మహేష్, యశోద, అప్పారావుతో పాటు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## మహా సంక్రాంతి సంబరాలకి సురేష్ గోపి



**విశాఖపట్నం, పెన్ సత్తా, జనవరి 10:** ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్ నందు నిర్వహిస్తున్నటువంటి జీవీఎల్ మహా సంక్రాంతి సంబరాలకి కేంద్ర పెట్రోలియం - గ్యాస్ మంత్రి, మలయాళ సూపర్ స్టార్ సురేష్ గోపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు దక్షిణ భారతదేశ ప్రజలతోనూ, వివిధ రాష్ట్రాల సంస్కృతులతో గల అనుబంధం గురించి ఆయన వివరించారు. గతంలో తెలుగు ప్రజల తోనూ, తెలుగు సినిమా రంగంతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ ప్రముఖ చలనచిత్రాలకు సంబంధించిన అనేక విషయాలను మీడియాతో, స్థానికులతో పంచుకున్నారు. సంక్రాంతి యొక్క విశిష్టతను వివరిస్తూ గతంలో జరిగిన జీవీఎల్ సంక్రాంతి వేడుకల గురించి తెలుసుకొని సంక్రాంతి సంస్కృతిని ప్రతిబింబించే విధంగా జరుగుతున్నటువంటి కార్యక్రమం తిలకించి ఆయన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా శ్రీజీవీఎల్ ను అభినందించారు. ఈ సందర్భంగా జివిఎల్ నరసింహారావు విశాఖపట్నంలో పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి గురించి అలాగే అరకు, లంబసింగి, బొర్రా గుహలతో పాటు పలు ఆధ్యాత్మిక ప్రాంతాలను కలుపుతూ పర్యాటక అభివృద్ధి కోసం పలు సూచనలు చేయగా వాటికి సురేష్ గోపి సానుకూలంగా స్పందించారు.

## ఏన్టీపీసీ లో ముగిసిన రెండు రోజుల శీతాకాలపు వర్క్‌షాప్



**పరవాడ, పెన్ సత్తా, జనవరి 10:** ఏన్టీపీసీ సింహాద్రి లో రెండు రోజుల జిఈఎం -2025 శీతాకాలపు వర్క్‌షాప్ ను శనివారం విజయవంతంగా ముగించింది. ఈ వర్క్‌షాప్ లో ప్రస్తుత సంవత్సరం పాల్గొనేవారు, మునుపటి జిఈఎం బ్యాచ్ ల పూర్వ విద్యార్థులు సహా 130 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇది పీర్ లెర్నింగ్, మెంటరింగ్ భాగస్వామ్య అనుభవాల కోసం ఒక శక్తివంతమైన వేదికను సృష్టించింది. ఈ వర్క్‌షాప్ లో బాహ్య నిపుణు లైన అధ్యాపకులు నిర్వహించిన విస్తృత శ్రేణి అనుభవపూర్వక, ఇంటరాక్టివ్ కార్యకలాపాలు ఉన్నాయి. వీటిలో పాల్గొనేవారిలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సహకార నైపుణ్యాలను బలోపేతం చేయడానికి రూపొందించబడ్డాయి. సమగ్ర కార్యక్రమ నిర్మాణం చురుకైన నిశ్చితార్థం, జట్టుకృషి, సృజనాత్మక వ్యక్తీకరణను ప్రోత్సహించింది, పాల్గొనేవారు వారి ఆకాంక్షలను వ్యక్తీకరించడానికి, స్థితిస్థాపకతను పెంపొందించడానికి, కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్ నైపుణ్యాలను మెరుగు పరచడానికి వీలు కల్పించింది. మునుపటి జిఈఎం విద్యార్థుల భాగస్వామ్యం
సంబంధిత రోల్ మోడల్‌లను అందించడం ద్వారా జిఈఎం చొరవ యొక్క దీర్ఘకాలిక ప్రభావాన్ని బలోపేతం చేయడం ద్వారా అభ్యాస వాతావరణాన్ని మరింత సుసంపన్నం చేసింది. జిఈఎం-2025 శీతాకాలపు వర్క్‌షాప్ విజయవంతంగా పూర్తి చేయడం, ఆడపిల్లల సాధికారత, యువత అభివృద్ధి, సమ్మిళిత సమాజ వృద్ధికి ఏన్టీపీసీ సింహాద్రి నిరంతర నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. ఈ ప్రాంతంలో స్థిరమైన, కొలవగల సామాజిక ప్రభావాన్ని సృష్టించే దాని విస్తృత సిఎస్సార్ దృష్టికి అనుగుణంగా ఉంటుంది.

# ఎలాన్ మస్క్ "గ్రోక్" ని ఇండోనేసియా తాత్కాలిక నిషేధం !!




**బిజినెస్ డెస్క్ పెన్ సత్తా, జనవరి 10::** మారుతున్న కాలానుగుణంగా టెక్నాలజీ రోజు రోజుకీ మరింత అభివృద్ధి చెందుతోంది. కానీ అందులో మంచితో పాటు రిస్క్, మిస్యూస్ కూడా పెరిగిపోతున్నాయి. అందుకు ఇటీవల కాలంలో ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది "గ్రోక్". ప్రపంచ కుభేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన 'ఎక్స్' ప్లాట్ ఫామ్ ఏఐ చాట్ బాట్ గా గ్రోక్ పేరు తెచ్చుకుంది. ఫోటో ఎడిటింగ్ ని చాలా సింపుల్ చేసిన ఈ ఏఐ బాట్, జనరేటివ్ ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీ, డిజిటల్ కన్సెంట్ వంటి వాటితో మహిళలకు తీవ్ర ఇబ్బందులు మిగిల్చింది. ఈ వ్యవహారం పై ప్రపంచ వ్యాప్తంగా పెను దుమారం నడుస్తూనే ఉంది. ఈ క్రమంలోనే కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్‌తో సృష్టిస్తున్న అసభ్యకర కంటెంట్ ఆన్‌లైన్ లో విపరీతంగా పెరిగిపోవడం పై భారత్ సహా పలు దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, 'గ్రోక్' చాట్‌బాట్ వినియోగం పై తాత్కాలిక నిషేధం విధించిన తొలి దేశంగా ఇండోనేసియా నిలిచింది. దీంతో ఈ విషయం ప్రపంచ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. ఇండోనేసియా మంత్రి మోత్యా హఫీద్ మాట్లాడుతూ ఆన్‌లైన్ లోని అసభ్యకర కంటెంట్‌ను మానవ హక్కులు, గౌరవం, పౌరుల భద్రతలకు ఉల్లంఘనగా తమ ప్రభుత్వం భావిస్తుందన్నారు. మహిళలు, చిన్నారులు సహా సమాజ రక్షణకే ఈ చర్యలు చేపట్టామని ఆయన వివరించారు. అధిక ముస్లిం జనాభా ఉన్న ఇండోనేసియా, ఆన్‌లైన్ అశ్లీలత కట్టడికి కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. మరో వైపు గ్రోక్ చాట్‌బాట్‌లో అశ్లీల కంటెంట్ పై భారత్ గతంలోనే తీవ్రంగా స్పందించింది. అటువంటి కంటెంట్‌ను వెంటనే తొలగించి, తీసుకున్న చర్యల పై నివేదిక ఇవ్వాలని ఎక్స్ ని ఆదేశించింది. ఎక్స్ నివేదించినా, భారత ప్రభుత్వం మరింత సమాచారం కావాలని కోరింది. ఈ పరిణామాల మధ్య, ఎక్స్ తన గ్రోక్ చాట్‌బాట్‌లో ఇమేజ్ జనరేషన్ పై పరిమితి విధించింది. ఇక పై అది కేవలం ప్రీమియమ్ సబ్‌స్క్రైబర్‌లకు మాత్రమే అందుబాటులో ఉంటుందని వెల్లడించింది.

# డీమార్ట్‌కు కోట్లలో లాభాల పంట




**బిజినెస్ డెస్క్ పెన్ సత్తా, జనవరి 10::** భారతదేశానికి చెందిన దిగ్గజ రిటైల్ సూపర్ మార్కెట్, చెయిన్ డీమార్ట్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. నిత్యావసరాల నుంచి మొదలుకొని మనకు అవసరమయ్యే చాలా వరకు వస్తువులన్నీ ఒకే చోట లభ్యమవుతాయి. ఇప్పుడు డీమార్ట్ పేరెంట్ కంపెనీ అవెన్యూ సూపర్ మార్ట్స్ లిమిటెడ్ క్యూ 3 ఫలితాల్ని ప్రకటించింది. లాభాలు, ఆదాయం ఎంత వచ్చాయి, మొత్తం ఎన్ని స్టోర్లు ఉన్నాయి సహా పూర్తి వివరాలు తెలిపింది. దిగ్గజ పారిశ్రామిక వేత్త రాధాకిషన్ దమానీ స్థాపించిన డీమార్ట్ అంటే తెలియని వారుండరని చెప్పొచ్చు. ప్రధాన నగరాల్లో ఎక్కువ సంఖ్యలో స్టోర్లను నిర్వహిస్తుంటుంది. తక్కువ ధర- ఎక్కువ అమ్మకాలు (లో కాస్ట్- హై వాల్యూమ్) అనే ఫార్ములాతో ఇది పని చేస్తుంది. ఇంకా చాలా వరకు అద్దెకు తీసుకోకుండా, సొంత స్థలాల్లోనే భవనాల్ని నిర్మించడం వల్ల ఖర్చుల్ని తగ్గించుకొని, వినియోగదారులకు ఇంకా తక్కువ ధరకే వస్తువుల్ని అందిస్తుంది. ఇక్కడ నిత్యావసర సరకుల నుంచి మొదలుపెడితే ఇంట్లోకి కావాల్సిన పాలు, పెరుగు, కూరగాయలు, దుస్తులు, ఫుట్‌వేర్, హోం అప్లియెన్సెస్, కిచెన్‌వేర్, పర్సనల్ కేర్ ప్రొడక్ట్స్ ఇలా అన్నీ ఒకే చోట మనకు అందుబాటులో ఉంటాయి. అందుకే ఇది సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. అవెన్యూ సూపర్ మార్ట్స్ లిమిటెడ్ డీమార్ట్ లిమిటెడ్‌కు, మాతృసంస్థగా ఉంది. ఇక కంపెనీ కార్యకలాపాల ఆదాయం కూడా వార్షిక ప్రాతిపదికన 13.3 శాతంగా నమోదైంది. ఇది అంతకు ముందు ఆర్థిక సంవత్సరం క్యూ 3 లో రూ. 15,972.55 కోట్లుగా ఉండగా.. ఇప్పుడు రూ. 18,100.88 కోట్లకు చేరుకుంది. ఎబిటా మార్జిన్ 7.6 శాతం నుంచి 8.1 శాతానికి పెరిగింది. ఇక 2025 డిసెంబరుతో ముగిసిన ఆర్థిక సంవత్సరం 9 నెలల కాలానికి ఆదాయం రూ. 51,137 కోట్లుగా ఉంది. అంతకు ముందు ఇది కేవలం రూ. 44,486 కోట్లుగానే ఉంది. ఈ 9 నెలల సమయంలో నికర లాభం రూ. 2,157 కోట్ల నుంచి రూ. 2,313 కోట్లకు పెరిగింది. డీమార్ట్ స్టోర్ల విషయానికి వస్తే సమీక్షా త్రైమాసికంలో 3 నెలల కాలంలో 10 కొత్త స్టోర్లను తెరిచింది. దీంతో 2025, డిసెంబర్ 31 నాటికి మొత్తం డీమార్ట్ స్టోర్ల సంఖ్య 442 కు చేరింది. డీమార్ట్ (అవెన్యూ సూపర్‌మార్ట్స్) షేర్ ధర విషయానికి వస్తే జనవరి 9 న 0.45 శాతం లాభంతో రూ. 3,807 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ. 2.48 లక్షల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 4,949.50 గా ఉండగా.. కనిష్ఠ ధర రూ. 3,340 గా ఉంది. ఈ అవెన్యూ సూపర్ మార్ట్స్ లిమిటెడ్ ఇప్పుడు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 మూడో త్రైమాసికం (అక్టోబర్- డిసెంబర్) ఫలితాల్ని శనివారం రోజు ప్రకటించింది. ఇక్కడ ఏకీకృత ప్రాతిపదికన కంపెనీ నికర లాభం క్యూ 3 లో రూ. 855.92 కోట్లుగా నమోదైంది. దీనినే టాక్స్ తీసేసిన తర్వాత ప్రాఫిట్‌గా (పాట్) చెప్పొచ్చు. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 18.3 శాతం పెరిగింది. 2024-25 క్యూ 3 లో లాభం రూ. 723.72 కోట్లుగా వచ్చింది.

# ఎస్‌బీఐ ఖాతాదారులకు షాక్.. పెరిగిన ఏటీఎం ఛార్జీలు




**బిజినెస్ డెస్క్: పెన్ సత్తా, జనవరి 10:** దేశం లోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు షాకిచ్చింది. ఏటీఎం లావాదేవీల పై ఛార్జీలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటర్ ఛేంజ్ రుసుములు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బ్యాంకు తెలిపింది. పెంచిన ఈ కొత్త ఛార్జీలు 2025 డిసెంబర్ 1 నుంచే అమల్లోకి వచ్చినట్లు ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ మార్పుల ప్రభావం ప్రధానంగా సేవింగ్స్, శాలరీ ఖాతాదారుల పై పడనుంది. సవరించిన నిబంధనల ప్రకారం ఎస్‌బీఐ ఖాతాదారులు ఉచిత పరిమితి దాటిన తర్వాత ఇతర బ్యాంకుల ఏటీఎంలలో చేసే నగదు విత్ డ్రాయల్ పై ఇకపై రూ. 23 తో పాటు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఛార్జీ రూ. 21 ( జీఎస్టీ అదనం)గా ఉండేది. అలాగే, బ్యాలెన్స్ చెకింగ్, మినీ స్టేట్ మెంట్ వంటి నాన్-ఫైనాన్షియల్ లావాదేవీల పై ఛార్జీని రూ. 10 నుంచి రూ. 11కి (జీఎస్టీ అదనం) పెంచారు. సేవింగ్స్ ఖాతాదారులకు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో నెలకు 5 ఉచిత లావాదేవీల పరిమితిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. శాలరీ ప్యాకేజీ ఖాతాదారుల విషయంలో ఎస్‌బీఐ కీలక మార్పులు, ముఖ్యంగా శాలరీ ప్యాకేజీ ఖాతాదారుల విషయంలో ఎస్‌బీఐ కీలక మార్పులు చేసింది. గతంలో వీరికి ఏ ఏటీఎంలో నైనా అపరిమిత ఉచిత లావాదేవీల సౌకర్యం ఉండగా, ఇప్పుడు దానిని నెలకు 10 కి పరిమితం చేసింది. ఈ 10 లావాదేవీలు దాటిన తర్వాత చేసే ప్రతి ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్‌కు రూ. 23, నాన్-ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్‌కు రూ. 11 (జీఎస్టీ అదనం) చెల్లించాలి. అయితే, కొన్ని ఖాతాల పై ఈ పెంపు ప్రభావం ఉండదని బ్యాంకు స్పష్టం చేసింది. ఎస్‌బీఐ బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బిఎస్బిడ) ఖాతాల సర్వీస్ ఛార్జీలలో ఎలాంటి మార్పులు లేవు.

# రో-కో మెరుపులు మళ్లీ చూస్తామా?

**న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ నేటి నుంచే**
**మధ్యాహ్నం 1.30 నుంచి**
**బరిలోకి శ్రేయస్ అయ్యర్**



ఇంకో పది రోజుల తర్వాత టీ20 సిరీస్.. ఆపై టీ20 ప్రపంచకప్.. అనంతరం ఐపీఎల్.. ఇలా వరుసగా పొట్టి క్రికెట్ సందడే సందడి. మళ్లీ వన్డేలు ఎప్పుడొస్తాయో.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను టీమ్‌ఇండియా జెర్సీల్లో ఎప్పుడు చూస్తామో! ఈలోపు ఈ ఇద్దరినీ న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో చూసే అవకాశం వచ్చింది. ఈ పోరు ఆదివారమే ఆరంభం కాబోతోంది. చివరగా దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో అదరగొట్టిన రో-కో.. కివీస్‌పైనా జోరు కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. గాయంతో రెండు నెలలకు పైగా ఆటకు దూరంగా ఉన్న శ్రేయస్ అయ్యర్.. ఈ సిరీస్‌తోనే పునరాగమనం చేయనున్నాడు.

2024లో టీమ్‌ఇండియాను దాని సొంతగడ్డపై వైట్‌వాష్ చేసి ప్రకంపనలు రేపిన న్యూజిలాండ్ జట్టు.. మళ్లీ ఇప్పుడు భారత పర్యటనకు వచ్చింది. ఈసారి ఇరు జట్ల మధ్య పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌లు జరగబోతున్నాయి. ముందుగా మూడు వన్డేల పోరులో భాగంగా ఆదివారం వడోదరలో తొలి మ్యాచ్ జరగనుంది. టెస్టుల్లో ఎదురైన పరాభవానికి వన్డేలు, టీ20ల్లో ప్రతీకారం తీర్చుకోవాలని టీమ్‌ఇండియా చూస్తోంది. దక్షిణాఫ్రికాపై సత్తా చాటి జట్టుకు సిరీస్ విజయాన్నందించిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలపై మరోసారి భారీ అంచనాలున్నాయి. ఐపీఎల్‌కు ముందు రెండు నెలల విరామం తీసుకోబోతున్న రో-కో ఈ సిరీస్‌పై తమదైన ముద్ర వేయాలని చూస్తున్నారు. గత ఏడాది అక్టోబరులో ఆస్ట్రేలియాతో రెండో వన్డే సందర్భంగా తీవ్రంగా గాయపడి ఆటకు దూరమైన శ్రేయస్ అయ్యర్.. ఈ సిరీస్‌లో ఆడబోతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఆడి ఫిట్‌నెస్, ఫామ్‌ను చాటుకున్న అతను.. కివీస్‌పై ఎలాంటి ప్రదర్శన చేస్తాడో చూడాలి.

జోరు కొనసాగనీ..: దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌ను 2-1తో భారత్ చేజిక్కించుకోవడంలో కోహ్లి, రోహిత్ కీలక పాత్ర పోషించారు. కోహ్లి మూడు మ్యాచ్‌ల్లో 2 శతకాలు, ఒక అర్ధశతకంతో 302 పరుగులు సాధిస్తే.. రోహిత్ రెండు అర్ధసెంచరీలతో 146 పరుగులు సాధించాడు. కివీస్‌తో సిరీస్‌లోనూ వీళ్లిద్దరూ జోరు కొనసాగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. సఫారీలతో సిరీస్‌కు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రాహుల్ నుంచి తిరిగి సారథ్య బాధ్యతలు అందుకోనున్నాడు. ఫామ్‌తో తంటాలు పడుతూ టీ20 జట్టులో చోటు కోల్పోయిన అతను.. ఈ సిరీస్‌లో ఎలా రాణిస్తాడో చూడాలి. రోహిత్‌తో కలిసి అతనే ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. కోహ్లి మూడో స్థానంలో వస్తాడు. ఈ ముగ్గురు జట్టుకు బలమైన పునాది వేయాల్సిన అవసరముంది. గాయం నుంచి కోలుకుని వచ్చిన శ్రేయస్‌కు ఈ సిరీస్ ఎంతో కీలకం. అతను ఇందులో రాణిస్తే.. గాయపడ్డ తిలక్ వర్మ స్థానంలో కివీస్‌తో టీ20లు ఆడే అవకాశం వస్తుంది. కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా మిడిలార్డర్ భారాన్ని మోయనున్నారు. సుందర్, జడేజాలకు తోడు కుల్‌దీప్ స్పిన్ బాధ్యతలను పంచుకోనున్నారు. మధ్య ఓవర్లలో ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేసే బాధ్యత వీరిదే. బుమ్రా అందుబాటులో లేని నేపథ్యంలో సిరాజ్ పేస్ దళాన్ని ఎలా నడిపిస్తాడో చూడాలి. అతడికి తోడుగా పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా కూడా తుది జట్టులో ఉంటారు. ప్రాక్టీస్ సందర్భంగా గాయపడిన పంత్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడని సమాచారం.

కివీస్.. కొంచెం కొత్తగా!: న్యూజిలాండ్ జట్టు మునుపటితో పోలిస్తే కొంచెం కొత్తగా కనిపిస్తోంది. విలియమ్సన్ సహా కొందరు సీనియర్లు ఆ జట్టుకు దూరమయ్యారు. ఇప్పటిదాకా భారత్‌లో ఆడిన అనుభవం లేని ఆటగాళ్లు కొందరు ఆ జట్టులో ఉన్నారు. ఓపెనింగ్‌లో నిక్ కెల్లీ.. పేస్ బౌలింగ్‌లో జాక్ ఫౌక్స్, మైకేల్ రే.. భారత సంతతికి చెందిన స్పిన్నర్ ఆదిత్య అశోక్.. ఆ జట్టులో కొత్త ముఖాలు. ఆల్‌రౌండర్ మైకేల్ బ్రేస్‌వెల్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న కివీస్‌కు డెవాన్ కాన్వే, డరెల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, విల్ యంగ్, హెన్రీ నికోల్స్, కైల్ జేమీసన్ లాంటి అనుభవజ్ఞుల అండ ఉంది. వీళ్లందరికీ భారత్‌లో ఆడిన అనుభవం ఉంది. ముఖ్యంగా మిచెల్, ఫిలిప్స్, కాన్వేలతో భారత బౌలర్లకు ముప్పు తప్పదు. బౌలింగ్‌లో జేమీసన్, ఫౌక్స్ కీలకం.

**పిచ్, వాతావరణం?**

వడోదరలోని కొటాంబి స్టేడియంలో జరగబోయే తొలి పురుషుల వన్డే ఇదే. ఇక్కడి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ప్రస్తుత చలి వాతావరణం దృష్ట్యా పేసర్లకూ సహకారం అందుతుంది. మంచు వల్ల స్పిన్నర్లకు బంతిపై పట్టు చిక్కడం కష్టం. టాస్ గెలిచిన జట్టు ఛేదనకే మొగ్గు చూపొచ్చు. మ్యాచ్‌కు వర్షం ముప్పేమీ లేదు.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్.

**న్యూజిలాండ్:** డెవాన్ కాన్వే (వికెట్ కీపర్), నిక్ కెల్లీ, విల్ యంగ్, డరెల్ మిచెల్, హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్, మైకేల్ బ్రేస్‌వెల్ (కెప్టెన్), జాక్ ఫౌక్స్, కైల్ జేమీసన్, మైకేల్ రే, ఆదిత్య అశోక్.

# ఆ పంచులు వాళ్లపైనేనా సర్ జీ!



నోరా ఫతేహి గోల్డ్-కాంస్య కార్సెట్ గౌనులో స్టన్స్



పాన్ ఇండియా కాన్సెప్ట్ లను పక్కన బెడితే? రీజనల్ మార్కెట్ ఫరిదిలో చేసే సినిమాల షూటింగ్ కూడా ఎంత సమయం పడుతుందో చెప్పాల్సిన పనిలేదు. నెలల తరబడి షూటింగ్ చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పబ్లిసిటీ కోసం భారీగానే ఖర్చు చేస్తున్నారు. ఒక సినిమా మొదలు పెట్టి పూర్తి చేసి రిలీజ్ చేయాలంటే నిర్మాతకు తల ప్రాణం తోకకు చేరుకుంటుంది. తీరా రిలీజ్ అయిన తర్వాత ఆ సినిమా హిట్ అవుతుందా? అంటే ఏడాదిలో 600 సినిమాలు రిలీజ్ అవుతుంటే? వాటిలో 200 సినిమాలు కూడా హిట్ జాబితాలో కనిపించడం లేదు. అంటే? ఫెయిల్యూర్ పర్సంటేజ్ ఏ స్థాయిలో ఉందో అద్దం పడుతుంది. ఇలా సినిమాలు తీసేవారంతా కచ్చితంగా పద్ధతి మార్చుకోవాల్సిందే. లేదంటే? పరిశ్రమ సక్సెస్ రేట్ అంతకంతకు పడిపోవడం ఖాయం. సరిగ్గా ఇవే విషయాలు దృష్టిలో పెట్టుకుని చిరంజీవి -మనశంకర వరప్రసాద్ గారు- వేదికపై వ్యాఖ్యానించినట్లు కనిపిస్తుంది. సినిమా షూటింగ్ ను తక్కువ డేస్ లోనే పూర్తి చేయాలి. అంటే షూటింగ్ వేగాన్ని పెంచాలి. నిర్మాణ పరంగా ఖర్చు తగ్గించాలి. ఎక్కడ ఖర్చు చేయాలి? ఎక్కడ తగ్గించాలి? అన్నది దర్శకుడికి స్పష్టమైన అవగాహన ఉండాలి. పబ్లిసిటీ కూడా తక్కువలో ముగించాలి. అందుకోసం ఎలాంటి స్ట్రాటజీ తో ముందుకెళ్లాలి. సినిమాలో నటీనటుల్ని ప్రచార పరంగా ఎలా వినియోగించుకోవాలి వంటి విషయాలు దర్శకుడికి తెలిసి ఉండాలి అని అనీల్ రావిపూడి సక్సెస్ ట్రాక్ని ఉద్దేశించి మాట్లాడారు. నేటి తరం సినిమా దర్శకులు ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని చేయగల్గితే నిర్మాతకు భారం తగ్గుతుంది అన్నది చిరు అభిప్రాయంగా తేలింది. అలాగే బాబితో కూడా చిరంజీవి -వాల్తేరు వీరయ్య- అనే సినిమా చేసి భారీ విజయం అందుకున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా షూటింగ్ కూడా బాబి చాలా వేగంగా పూర్తి చేసి రిలీజ్ చేసి బ్లాక్ బస్టర్ ఇచ్చాడు. అనవసరమైన సెట్లు వేయలేదు. ఎక్కడ అవసరమో ? అక్కడే సెట్లు వేసారు. తక్కువ ఖర్చులోనే ఎక్కువ లాభాలు చూపించిన చిత్రమది. ఈ నేపథ్యంలో చిరు మరో సినిమా బాబితో కమిట్ అయ్యారు. -మనశంకర వరప్రసాద్ గారు- రిలీజ్ అనంతరం ఆ చిత్రమే పట్టాలెక్కుతుంది. నటసింహ బాలయ్య కూడా ఎంతో తెలివిగానే సినిమాలు చేస్తున్నారు. తన మార్కెట్ ఫరిదిని దాటకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ క్రమంలో తక్కువ బడ్జెట్ లో హిట్ సినిమాలు ఇచ్చే దర్శకుల్నే ఎంపిక చేసుకుంటున్నారు. బాలయ్య తదుపరి చిత్రం కూడా గోపీచంద్ మలినేనితో లాక్ అయిన సంగతి తెలిసిందే.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com